

సర్వం సిద్ధం !

ఎల్లుండి నుంచి ఇంటర్ పరీక్షలు

- 81 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- హై పవర్ కమిటీ ఏర్పాటు
- ఏడు సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- కట్టుదిట్టంగా బందోబస్తు
- ఆర్ఐవో శ్రీనివాసులు వెల్లడి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27 : జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి మార్చి 20 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలోని 54 ప్రైవేట్, 27 ప్రభుత్వ కళాశాలలతో కలిసి మొత్తం 81 కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నెల్లూరు నగరంలోని ఆర్ఐవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.

● నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఇచ్చిన సమయం కంటే నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 25,202, ఒకేషనల్ 1217 మంది కలిపి 26,419 మంది హాజరవుతున్నారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 24,243, ఒకేషనల్‌కు 1414 మంది కలిపి 25,657 మంది హాజరవుతున్నారన్నారు.



నెల్లూరులోని కేఏసీ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐవో తదితరులు

● అధికారుల నియామకం

ఈ పరీక్షలకు 1200 మంది ఇన్విజిలేటర్లు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, 81 మంది చీఫ్‌లు, 81 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 16 మంది కస్టోడియన్‌లతోపాటు డీఈసీ సభ్యులను నియమించామని ఆర్ఐవో వివరించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సీఎస్‌లు, కస్టోడియన్‌లతో సమావేశం నిర్వహించామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

పరీక్షల నిర్వహణలో ఏదైనా సమాచారం, ఇబ్బందులను తెలియచేసేందుకు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూములో 0861-2320312 నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష లను పర్యవేక్షిం చేందుకు ఇంటర్ బోర్డులో పనిచేస్తున్న ఓఎస్‌డీ ఎస్.బహుగుణ, సూపరింటెండెంట్ భాను కిషోర్‌లను జిల్లాకు పరిశీలకులుగా నియమించినట్లు ఆర్ఐవో తెలిపారు. కాగా నగరంలోని వివిధ కళాశాల్లో ఏర్పాటు చేయనున్న పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో తదితరులు పరిశీలించారు.



● అధికారులతో సమన్వయం

పరీక్షల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఆర్ఐవో తెలిపారు. పోలీస్, విద్యావిభాగం, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, పోస్టల్, హెల్త్, మునిసిపాలిటీ అధికారులతో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. దూర ప్రాంతాల విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేసేలా ఆర్టీసీ అధికారులు అంగీకరించారని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జెరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

● సెల్‌ఫోన్ నిషేధం

విధులకు హాజరయ్యే అధికారుల సెల్‌ఫోన్‌లను జీపీఎస్ సిస్టమ్ ద్వారా ఇంటర్‌బోర్డు ట్రాకింగ్ చేస్తుందన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్‌లు ఎవరూ కూడా సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్‌లు, అభ్యంతరకర వస్తువులు, కాగితాలను పరీక్ష హాలులోకి తీసుకెళ్లకూడదన్నారు. ఒక్కో కేంద్రానికి నాలుగు చొప్పున అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని చెప్పారు. హాల్‌టికెట్‌పై కళాశాల స్టాంపింగ్, ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షలకు అనుమతిస్తామని తెలిపారు.

● ఏడు సమస్యాత్మక కేంద్రాలు

జిల్లాలో ఏడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో జరిగిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని బందోబస్తును కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా పీహెచ్‌సీ విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు

బాబు సభ ఏర్పాట్లపై సమీక్ష

- మార్చి 2న టీడీపీ అధినేత నెల్లూరు రాక
- వీపీఆర్ కన్వెన్షన్ హాలులో సభ
- 'దేశం'లో చేరనున్న వేమిరెడ్డి దంపతులు
- వీపీఆర్ బాటలోనే మరికొందరు...

నెల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్), ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి టీడీపీ చేరిక సందర్భంగా మార్చి 2న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నెల్లూరుకు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారయ్యింది. ఈ సందర్భంగా కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో సభ నిర్వహించనున్నారు. 2వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు చంద్రబాబునాయుడు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. చంద్రబాబు రాక, వీపీఆర్ దంపతులతో పాటు ఆయనకు మద్దతుగా భారీ సంఖ్యలో నెల్లూరు నగర వైసీపీ నాయకులు కూడా టీడీపీలో చేరనున్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. చంద్రబాబు పర్యటనలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసే క్రమంలో మంగళవారం వీపీఆర్ కన్వెన్షన్‌లో టీడీపీ ముఖ్య నాయకులు ఏర్పాట్లపై సమీక్షించారు. ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, జనసేన నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లపై సమీక్షించారు. చంద్రబాబు రాక సందర్భంగా భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. వీపీఆర్ వెంట టీడీపీలో చేరడానికి జిల్లావ్యాప్తంగా పలువురు నేతలు సిద్ధమయ్యారు. టీడీపీలో చేరే నాయకులు, వారి అనుచరులతో వీపీఆర్ కన్వెన్షన్ హాలు కిక్కిరిసిపోనున్నది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వీపీఆర్ తన సిబ్బందికి సూచించారు.

టెట్ ప్రారంభం

- తొలిరోజు 385 మంది హాజరు



గీతాంజలిలో ఏర్పాటైన సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఈవో తదితరులు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మంగళవారం ప్రారంభమైంది. మార్చి 6వతేదీ జరిగే ఈ పరీక్షకు జిల్లాలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెల్లూరు డివిజన్‌కు ముత్తుకూరురోడ్డులోని గీతాంజలి పీజీ కళాశాల, జొన్నవాడ-నరసింహకొండ రోడ్డులోని ఇయాన్ డిజిటల్ జోన్‌ను, కావలి డివిజన్‌కు ఉదయగిరి రోడ్డులోని పీబీఆర్ విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 6,363 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో 471 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 385 మంది హాజరయ్యారు. 86 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష నిర్వహణ తీరును డీఈవో పీవీజే.రామారావు, జిల్లా అబ్జర్వర్ డీ మధు సూదన్‌రావులు పర్యవేక్షించారు.

నెల్లూరుకి మంచినీళ్లిచ్చారా ?



వాటర్ ప్లాంట్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న యువసేన నాయకులు

- ఐదేళ్లలో వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు పూర్తిచేశారా?
- వైసీపీ ప్రభుత్వంపై నారాయణ యువసేన మండిపాటు
- నెల్లూరు టూ సంగం కార్యక్రమానికి భారీగా కార్యకర్తలు
- ప్లాంట్ గేటు మూసి ఉండడంతో నిరసన

పొదలకూరు, ఫిబ్రవరి 27: నెల్లూరు నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గత టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న డాక్టర్ పొంగూరు నారాయణ పొదలకూరు మండలం మహమ్మదాపురం తిప్ప వాటర్ ప్లాంట్ ప్రాజెక్టును మంజూరు చేయించారు. అయితే ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం దాన్ని పట్టించు కోలేదంటూ మంగళవారం నారాయణ యువసేన నెల్లూరు టూ సంగం కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మహమ్మదాపురం తిప్ప వద్ద ఆందోళన చేపట్టారు. సేకరించిన వివరాల మేరకు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నారాయణ యువసేన నాయకులు కృష్ణయాదవ్, యశ్వంత్‌రెడ్డి, లెకిన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, అమర్, నాని, ముస్తక్, హేమంత్, మున్నా, శివారెడ్డి, మిత్రబృందం ఆధ్వర్యంలో భారీగా సంగం బ్యారేజీ మీదుగా వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. 50 టెంపోలలో సుమారు వేయిమంది వరకు తరలివచ్చారు. అయితే వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్ద గేట్లు మూసేసి ఉండడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో యువసేన నేతలు వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు వద్ద వేచి చూశారు. పోలీసులను నెట్టుకుని ప్రాజెక్టులోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఎంతసేపటికి అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టారు. తాము వస్తామని తెలిసి అధికారులు ప్రాజెక్టు గేట్లు మూసి వేయడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. మహమ్మదాపురం వాటర్ ప్లాంట్ ప్రాజెక్టు నుంచి నెల్లూరు వరకు చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు టీడీపీ హయాంలో 84 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన 16 శాతం పనులను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని మండిపడ్డారు. దీంతో నెల్లూరు నగర ప్రజలకు తాగడానికి మంచినీరు కరువయిందన్నారు. కలుషితనీరు తాగి నగర ప్రజలు అవస్థలు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్య బట్టారు. ఈ నాలుగున్నరేళ్లలో నగరవాసులకు మౌలిక సదుపాయాలను కూడా అందించలేద న్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని రోజుకొకటి లెక్కన చూపిస్తామని, వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధి ఒక్కటంటే ఒక్కటి చూపించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డితో పాటు నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 28డివిజన్లకు చెందిన నారాయణ యువసేన నేతలు, కార్యకర్తలు, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులను నెట్టుకుని వాటర్ ప్లాంట్ ప్రాజెక్టులోకి వెళుతున్న నారాయణ యువసేన కార్యకర్తలు

కందుకూరు బరిలో
బుర్రా మధుసూదన్

- వైసీపీ అభ్యర్థిగా ఖరారు ?
- సీఎంను కలిసిన వంకి పెంచలయ్య
- ఫలించని ప్రయత్నాలు

కందుకూరు, ఫిబ్రవరి 27: కందుకూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ఆపార్టీకి చెందిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. కందుకూరు ఇన్‌చార్జిగా వంకి పెంచలయ్య కుమార్తె కఠారి అరవిందను పార్టీ అధిష్టానం నియమించగా, ఆమె నేటి వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో రెండురోజులుగా మధుసూదన్‌తాడేపల్లిలోనే మకాం వేసి కందుకూరు ఇన్‌చార్జి పదవి కోసం తనవంతుగా ప్రయత్నాలు చేశారు. కనిగిరి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బుర్రాకు అక్కడ తిరిగి అవకాశం ఇచ్చేందుకు నిరాకరించిన జగన్ నెల క్రితమే కందుకూరు వెళ్లాలని ఆదేశించారు. అయితే అప్పట్లో ఇక్కడ పోటీచేసేందుకు బుర్రా విముఖత చూపటంతో జగన్ కఠారి అరవిందను ఇన్‌చార్జిగా నియమించారు. అనంతర పరిణామాలతో అరవింద పోటీకి సిద్ధపడకపోవటంతో బుర్రా పేరును పరిశీలనలోకి తీసుకుని ఖరారుచేసినట్లు విశ్వసనీయ సమాచారం.



బుర్రా మధుసూదన్ యాదవ్

● పోటీకి సిద్ధం : వంకి

కాగా మంగళవారం వంకి పెంచలయ్య కూడా తాడేపల్లికి వెళ్లి తన కుమార్తె పోటీచేయటానికి ఇబ్బందులు ఉన్నాయని, ఆమె స్థానంలో తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. అరవింద పోటీకి సిద్ధపడితే ఇప్పటికైనా వెళ్లి పనిచేసుకోవాలని, లేకుంటే లేదని జగన్ తేల్చి చెప్పగా అందుకు పెంచలయ్య విముఖత తెలిపినట్లు తెలిసింది. ఈ క్రమంలో కందుకూరు ఇన్‌చార్జిగా బుర్రాను ఖరారు చేసినట్లు తెలిసింది. మార్చి 3న మేదరమిట్ల సమీపంలో జరిగే సిద్ధం బహిరంగ సభకు కందుకూరులో ఏర్పాట్ల బాధ్యతలు చూడాల్సి ఉన్నందున బుధవారం బుర్రా పేరును అధిష్టానం ప్రకటించే అవకాశం ఉందని వైసీపీ ముఖ్యనేతలు పేర్కొన్నారు.

నిరుద్యోగులతో ఆటలు

- ఆర్‌అండ్‌బీ అతిథిగృహాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టుల మంజూరు
- 27 ఖాళీలకు 841 మంది దరఖాస్తు
- జీతాలు మాత్రం గెస్ట్‌హౌస్‌ల నుంచే ఇవ్వాలట !
- నిర్వహణకే కష్టమైతే వేతనాలు ఎలా ?

నెల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె.. అన్నట్లుగా ఉంది. రహదారులు, భవనాల(ఆర్అండ్‌బీ) శాఖ అతిథిగృహాల్లో ఉద్యోగాల భర్తీ. గెస్ట్‌హౌస్‌ల నిర్వహణకే డబ్బుల్లేక అధికారులు నానా తంటాలు పడుతుంటే, ఇప్పుడు అక్కడ నియమిస్తున్న ఉద్యోగులకు కూడా ఆ గెస్ట్‌హౌస్‌ల నుంచే వస్తున్న ఆదాయాన్ని జీతాల రూపంలో చెల్లించాలట. ఇవి ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు. జిల్లాలోని తొమ్మిది ఆర్‌అండ్‌బీ అతిథిగృహాల్లో అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ ఉద్యోగులకు జీతాల దగ్గరే అసలు సమస్య తలెత్తి తుంది. తొమ్మిది గెస్ట్ హౌస్‌ల్లో తొమ్మిదేసి మంది అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులకు ఆర్‌అండ్‌బీ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. అటెండర్ పోస్టులకు 593, వాచ్‌మన్ పోస్టులకు 147, స్వీపర్ పోస్టులకు 101 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తంగా 27 పోస్టులకు 841 దరఖాస్తులు అందా యి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ఎనిమిది మంది జిల్లా అధికారుల కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది. మార్చి నుంచి ఎంపికయినవారు పనిచేయాల్సి ఉంటుంది.

● తక్కువమందే అద్దెలకు...

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు, ఇతర రంగాల ప్రముఖులు వినియోగించుకుంటుంటారు. ఇందుకుగానూ ప్రభుత్వం నిర్దేశించిన అద్దె చెల్లించాలి. అయితే ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లను అద్దెకు తీసుకునే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. ఒక్క నెల్లూరు మినహా మిగిలిన చోట్ల నెలకు రెండు, మూడు రోజులు కూడా అద్దెకు తీసుకునే పరిస్థితిలేదు. నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ కూడా ఆర్‌అండ్‌బీ చేతుల్లో కాకుండా కలెక్టరేట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కొన్నేళ్ల నుంచి అందులో బుకింగ్ అంతా కలెక్టరేట్ నుంచే జరుగుతున్నాయి. ఎవరు వస్తున్నారు..? ఎంత అద్దె వస్తోంది..? అన్న విషయాలేవీ ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియడం లేదు. కానీ నిర్వహణ మాత్రం ఆర్‌అండ్‌బీనే చేస్తోంది. ఇలా ఏటా ఒక్కో గెస్ట్‌హౌస్ నిర్వహణకు రూ.లక్షల్లోనే ఖర్చవుతోంది. ఈ ఖర్చుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి రాక ఆర్‌అండ్‌బీ అధికారులే నానా తంటాలు పడుతున్నారు.

● జీతాలు ఎలా చెల్లిస్తారు..?

ఇప్పుడు కొత్తగా నియమితులవుతున్నవారికి గెస్ట్‌హౌస్‌లకు అద్దెరూపంలో వచ్చే నగదు నుంచే జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం నిరుద్యోగులతో ఆటలాడుకోవడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్, వాచ్‌మన్, స్వీపర్ పోస్టులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చెల్లించినా, నెలకు రూ.45 వేలు అవసరం. అలానే విద్యుత్ బిల్లులు, రిజిస్టర్‌లు, కార్యాలయ నిర్వహణకు మరో రూ.20 నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుందని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతు న్నాయి. ఇలా మొత్తంగా చూసుకున్నా ఒక గెస్ట్‌హౌస్ నిర్వహణకు నెలకు సుమారు రూ.70 వేల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఏ గెస్ట్‌హౌస్‌లో కూడా అంత మొత్తం అద్దె రూపంలో రావడం లేదు. మరి కొత్తగా చేరే ఉద్యోగులకు జీతాలు ఎలా చెల్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. 27 పోస్టులకు 841 మంది దరఖాస్తు చేసుకున్నారంటేనే నిరుద్యోగ సమస్య ఎలా ఉందో అర్థమవుతోంది. అలాంటిది ఉద్యోగంలో చేరాక సకాలంలో జీతాలు చెల్లించలేకపోతే ఆ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాల పరిస్థితేమిటన్న వాదన వినిపిస్తోంది.



2.20 లక్షల మంది రైతులకు
రూ.45.28 కోట్లు

- నేడు పీఎం కిసాన్, రైతు భరోసా నిధుల విడుదల
- సున్నా వడ్డీ నగదు కూడా ఖాతాల్లోకి..

నెల్లూరు(వ్యవసాయం): పీఎం కిసాన్, వైఎస్ఆర్ రైతు భరోసా పథకాల కింద పెట్టుబడి సాయంగా మూడో విడత నిధులు విడుదల బుధవారం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2,20,749 మంది రైతుల ఖాతాల్లో రూ.45.28కోట్ల నిధులు జమ అవుతా యని ఆమె పేర్కొన్నారు. అలాగే 2021-22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్లలో రూ.లక్షలోపు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ నిధులు కూడా జమ అవుతాయని వివరించారు. 2021-22 రబీ సీజన్‌కు సంబంధించి 14,483 మంది రైతులకు రూ.3.7కోట్లు, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 3148 మంది రైతులకు రూ.81.66లక్షలు అన్నదాతల ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన భవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

రైలు ప్రయాణికులకు తీపికబురు

- ప్యాసింజర్, మెమూ ట్రైన్ల చార్జీల తగ్గింపు
- రూ.10 చార్జీ పునరుద్ధరణ
- జిల్లాలో వేలాదిమందికి ఊరట

నెల్లూరు (వెంకటేశ్వరపురం): సాధారణ రైలు ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ప్యాసింజర్,మెమూ రైళ్లలో చార్జీలను తగ్గించింది. ఈ మేరకు రైల్వేశాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2020కు ముందు నెల్లూరు నుంచి గూడురుకు ప్యాసింజర్ రైలులో రూ.10 టికెట్ ఉండేది. అయితే 2020 తరువాత కరోనా సమయంలో అన్ని ప్యాసింజర్, మెమూ రైళ్లలో ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలను ఖరారు చేశారు. దీంతో గూడురుకు రూ.10 ఉన్న టికెట్ ధర రూ.30లకు పెరిగింది. అలాగే అన్ని ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరలను కూడా పెంచారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం టికెట్ ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రయాణికులకు ఎంతో ఊరట కలిగింది. దీంతో నెల్లూరు మీదుగా రాక పోకలు సాగించే 12 ప్యాసింజర్,మెమూ రైళ్లలో టికెట్ ధరలు తగ్గనున్నట్లు రైల్వే కమర్షియల్ మేనేజర్ వంశీ తెలిపారు.

మహాభారతం - భారతీయ దార్శనికతపై సదస్సు


సదస్సుకు వచ్చిన అతిథులతో సంచాలకుడు సంపత్‌కుమార్

వెంకటాచలం, ఫిబ్రవరి 27: చవటపాళెం పంచాయతీలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మహాభారతం- భారతీయ దార్శనికత అనే అంశంపై మూడురోజుల జరిగే జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షతన తొలిరోజు జరిగిన సదస్సులో నెల్లూరు డీకేడబ్ల్యూ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి, హైదరాబాద్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు దేవిరెడ్డి విజయలక్ష్మి, మేడసాని మోహన్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. వ్యక్తి, కుటుంబ, సమాజ సాంసారిక జీవితానికి మహాభారతం దారిదీపమన్నారు. నన్నయ, తిక్కన, ఎర్రనలు రాసిన భారతంలోని విశిష్టమైన పద్యాల్ని సందర్భోచితంగా ఉత్కృష్టంగా చదువుతూ శ్రోతలను మైమరిపించారు. అంతేకాదు గొప్ప జీవితాన్ని అలవార్చుకోవాలంటే భారతం చదవాలని, మహాభారతంలో ఉన్నదంతా లోకంలో ఉన్నదని, మహాభారతంలో లేనిదేదీ లోకంలో లేదనే లోకోక్తిని గుర్తు చేస్తూ వారు ప్రసంగించారు. మహాభారతంలోని ఆయా అంశాలను నేటి కుటుంబ జీవితానికి అన్వయించి వివరించారు. కార్యక్రమంలో విశిష్ట అధ్యయన కేంద్ర విద్యాత్మక, కార్యనిర్వాహక సిబ్బంది, పండితులు, ఔత్సాహికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా విద్యుత్ లేక ఎండుతున్న పంటలు

- ఏఈని నిర్బంధించిన కొత్తపల్లి రైతులు


విద్యుత్ ఏఈని నిలదీస్తున్న రైతులు

కావలి, ఫిబ్రవరి 27: కావలి రూరల్ మండలం కొత్తపల్లిలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. దీంతో పంటలు ఎండుతుండడంతో రైతుల కడుపు మండుతోంది. ఈ విషయాన్ని రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో మంగళవారం కావలి రూరల్ ఏఈ చేజర్ల శ్రీనివాసులు తమ సిబ్బందితో కొత్తపల్లికి చేరుకోవడంతో రైతులు ఆయనపై ఆక్రోశం వెళ్లగక్కగా ఆయన నుంచి నిర్లక్ష్య సమాధానం వచ్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు ఆయనను నిలదీశారు. గతంలో చోడవరం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతున్నపుడు లోవోల్టేజీ సమస్య ఉండేదని, ఇప్పుడు కావలి ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా ఇస్తుండటంతో హై ఓల్టేజీ వచ్చి ఫీజులు నిలవక విద్యుత్ సరఫరా ఉండడం లేదన్నారు. దీనికి తోడు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండటంతో మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. చెట్ల కొమ్మలు రైతులే కొట్టుకోవాలని, విద్యుత్ సరఫరాలో ఒడిదుడుకులకు మేము ఏమి చేయగలమని దురుసుగా సమాధానం చెప్పడంతో రైతులు ఆగ్రహించి ఇక మీరుండేదెందుకు అంటూ నిలదీశారు. అనంతరం అక్కడ నుంచి ఏఈ వారి సిబ్బందితో వెళ్లి పోయి కాలిన ఫీజులు వేసినా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా రాలేదని రైతులు వెల్లడిస్తున్నారు.

పొగాకు దొంగల పట్టివేత

కలిగిరి, ఫిబ్రవరి 27: మండలంలోని పలు గ్రామాల్లోని పొగాకు తోటల్లో రాత్రివేళల్లో దొంగతనంగా పొగాకు తీసుకెళ్లే మహిళా దొంగలను వెలగపాడు పంచాయతీ కొత్తూరు గ్రామస్థులు కాపుకాసి మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. 8 మంది మహిళలు ఆటోలో వచ్చి పొగాకు తోటల్లో ఆకును దొంగనతనంగా తీసుకెళ్లే క్రమంలో రైతులు తోటల చుట్టూ ఒక్కసారిగా వచ్చి వారిని పట్టుకుని ఆ ఆటోలో గ్రామంలోకి తీసుకెళ్లారు. సదరు మహిళలు కలిగిరికి చెందిన వారిగా గుర్తించి కలిగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రైతులు పొగాకు చోరీ జరుగుతున్నట్లు ఇటీవల తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ చర్యలకు పాల్పడుతున్నది మహిళలు కావడంతో మరోసారి ఇలాంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, రైతులకు నష్టం కలిగించవద్దని తీవ్రంగా మందలించి వారిని వదిలివేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యారన్ దగ్ధం: రూ.4లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో దగ్ధమైన పొగాకు బ్యారన్

కలిగిరి, ఫిబ్రవరి 27: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సుంకర పోలయ్యకు చెందిన పొగాకు బ్యారన్ ప్రమాదవశాత్తూ మంగళవారం దగ్ధమైంది. వివరాల మేరకు.. పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. దీంతో రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. వింజమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి


విద్యార్థిని సంధ్య మృతదేహం

సంగం, ఫిబ్రవరి 27: వెంగారెడ్డిపాళెంకు చెందిన నాలుగోతరగతి విద్యార్థి సంధ్య (9) మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి దాటుతుండగా కారు ఢీకొని మృతి చెందింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుండాల శిరీషకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సంధ్య రోజు మాదిరిగానే సాయంత్రం బడి వదిలిన తరువాత ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా బుచ్చిరెడ్డిపాళెం నుంచి సంగం వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ సంఘటన జరిగింది. గాయపడిన విద్యార్థిని అదే కారులో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందంతో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. అనంతరం వైద్యశాలకు వెళ్లి విచారించి కేసు నమోదు చేశారు.

చీటీల నగదుతో మహిళ పరారీ !

- పోలీసు స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు


పోలీసు స్టేషన్ వద్ద బాధితులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 27: పెద్ద మొత్తంలో చీటీలు వేయించుకొని నగదు చెల్లించకుండా నిర్వాహకులు కుటుంబంతో పారిపోయారని బాధితులు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని కొత్తూరు ప్రాంతంలో నివాసం ఉంటున్న లలితమ్మ చీటీలు వేస్తుంటుంది. తొలి రోజుల్లో చీటీ పాడిన వెంటనే నగదును నమ్మకంగా చెల్లిస్తుండేది. దీంతో ఆమె వద్ద అదే ప్రాంతానికి చెందిన జ్యోతి, భాగ్యమ్మ, రమణ ఇలా పలువురు పెద్ద మొత్తంలో చీటీలు వేశారు. అయితే కొంతకాలంగా లలితమ్మ చీటీల తాలూకు నగదు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చింది. ఇటీవల కుటుంబంతో సహా ఎటో వెళ్లిపోయింది. లలితమ్మ కుటుంబం ఇంట్లో లేకపోవడం, ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు వేదాయపాళెం పోలీసులను ఆశ్రయించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	72
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	122

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5942
వెండి కిలో ధర	రూ. 71,900
వెండి ఒక గ్రాము	రూ. 73.90

కుష్ఠు సర్వే వివరాలు అప్‌లోడ్ చేయండి


- ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 : జిల్లాలో నిర్వహించిన కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే వివరాలను 100 శాతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు జిల్లా వైద్యాధికారి, కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని కుష్ఠు విభాగంలో అధికారులతో ఆయన సమీక్షించారు. వ్యాధి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కొత్త కేసులను గుర్తించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కాళ్లు, చేతులు దెబ్బతిన్న వ్యాధిగ్రస్తులకు వెంటనే శస్త్రచికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీవైఐటీ కో ఆర్డినేటర్ సంతోష్, డీపీఎంవో, ఏపీఎంవోలు పాల్గొన్నారు.

డైలమాలో డయాలసిస్ !

- ఉదయగిరి, వింజమూరులో కేంద్రాల మంజూరు
- నెలలు గడుస్తున్నా ప్రారంభమేది !?
- వైద్యసేవల కోసం ఇతర ప్రాంతాలకు పరుగు
- బాధితులకు తప్పని ఆర్థిక ఇబ్బందులు

కేంద్రం ఏర్పాటు చేయాలి



ఈయన పేరు బసిరెడ్డి వెంకట రమణారెడ్డి. ఉదయగిరి మండలం మల్లారెడ్డి పల్లి వాసి. మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. వారానికి మూడుసార్లు 108 వాహనంలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ మందులు, ప్రయాణ ఖర్చులకే సరిపోతుందని, ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నాడు.

దూర ప్రాంతాలకు వెళ్లలేక పోతున్నాం..



ఉదయగిరి మండలం శకునాలపల్లికి చెందిన ఈర్ల రమణయ్య వారానికి రెండుసార్లు ఆత్మకూరులో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. దూరప్రాంతానికి వెళ్లాలంటే వ్యయ ప్రయాసలతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయాడు. అధికారులు స్పందించి ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి బాధితుల కష్టాల తీర్చాలని వేడుకుంటున్నాడు.

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 27: ఉదయగిరి నియోజకవర్గంలో మూత్రపిండాల వ్యాధిగ్రస్థుల (డయాలసిస్) తలరాత మారడం లేదు. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతున్నా నివారణ చర్యల్లో మాత్రం ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తూనే ఉంది. ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారు. సరైన సేవలు అందక ఇప్పటికే కొందరు మృతి చెందగా.. మరికొందరు డయాలసిస్ చేయించుకుం టున్నారు. డయాలసిస్ కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మకూరు, నెల్లూరు వైద్యశాలలకు వెళ్లాల్సి ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోతున్నారు.

● గతేడాది నవంబరులోనే మంజూరు

నియోజకవర్గ కేంద్రంలో గతేడాది నవంబరులో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా డయాలసిస్ బాధితులు తమ బాధలను కలెక్టర్ హరినారాయణన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాని(సీహెచ్‌సీ)కి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయించారు. అయితే ఇప్పటికీ ఆ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. అలాగే వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి సైతం గతేడాది అక్టోబరులో డయాలసిస్ కేంద్రం మంజూరైంది. కేంద్రానికి సంబంధించిన అన్ని పరికరాలు వైద్యశాలకు చేరినా ప్రారంభానికి నోచుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రకటించినా ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో అంటూ ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు.


ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం

● ఎంతో ఉపయోగకరం...

జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉదయగిరి 50 పడకల వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రధానంగా సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు, మర్రిపాడు తదితర మండలాల్లో సుమారు 50 మంది వరకు డయాలసిస్ రోగులు ఉన్నారు. ఉదయగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే వ్యయ ప్రయాసాలతోపాటు రవాణా ఇబ్బందులు, ఆర్థిక కష్టాలు తొలుగుతాయి. ప్రస్తుతం ఆయా మండలాల్లో ఉన్నవారంతా ఆత్మకూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. 108 వాహనం డయాలసిస్‌కు వెళ్లే సమయంలో మాత్రమే బాధితులను తీసుకెళుతుంది. అనంతరం బాధితులు ఇంటికొచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉదయగిరి, వింజమూరులలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి తమ కష్టాలు తీర్చాలని బాధితులు కోరుతున్నారు.

విధివిధానాలు రావాల్సి ఉంది..

ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి డయాలసిస్ కేంద్రం మంజూరైంది. సంబంధిత వైద్య కమిషనర్ నుంచి విధివిధానాలు రావాల్సి ఉంది. రాగానే ఏర్పాటుకు చర్యలు చేపడతాం. నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్ప గించారు.

- రమేష్‌నాథ్ , డీసీహెచ్‌ఎస్, నెల్లూరు

ఎన్నికల కోడ్ అడ్డురాకుండా జిమ్మిక్కులు!

- 'గడప గడప'కు పనులు చేపట్టినట్లు ఫొటోలు
- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సచివాలయ సిబ్బంది
- కొత్త ఐడియాతో ఎన్నికల సంఘం కళ్లకు వైసీపీ గంతలు
- అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న నాయకులు

కావలి, ఫిబ్రవరి 27: ఎన్నికల వేళ కొత్తకొత్త ఐడియాలతో వైసీపీ నాయకులు అభివృద్ధి పేరుతో జిమ్మిక్కులు చేస్తున్నారు. ఇప్పటి వరకు తట్టెడు మట్టి వేయకుండా, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని పాలకులు మళ్లీ ఓట్ల కోసం ప్రజల ముంగిటకు వెళ్లేందుకు కొత్త పంథాను అవలంబిస్తున్నారు. అందులో భాగంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పనులు పేరుతో గట్టెక్కేందుకు అధికారులు, పాలకులు నానా తంటాలు పడుతున్నారు. ఎమ్మెల్యేలను గడపగడపకు వెళ్లమని సీఎం చెప్పగా అందుకు ఎమ్మెల్యేలు అక్కడకు వెళ్లి వారు అభివృద్ధి గురించి అడిగితే ఏమి సమాధానం చెప్పాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గడపగడప కార్యక్రమంలో గుర్తించిన పనులు చేపట్టేందుకు కావలి మున్సిపాల్టీకి ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల వంతున పట్టణంలోని 28 సచివాలయాల పరిధిలో గుర్తించిన 255 పనులకు రు.11.20 కోట్లు మంజూరు చేశారు.


ముసునూరు ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై మట్టిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్


పనులు ప్రారంభించినట్లు ఫొటో తీస్తున్న సచివాలయ ఉద్యోగి

● ముందుకు రాని కాంట్రాక్టర్లు

పట్టణంలో మంజూరైన పనులకు టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్ల పేరుతో టెండర్లు వేశారు. ఆ పనులు ఎవరు చేయాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో వార్డుల వారీగా కొందరు నేతలను గుర్తించి వారికి అనుకూలమైన వార్డులలో వారితో పనులు మొదలు పెట్టించారు. ఇప్పటి వరకు సుమారు రూ.3 కోట్ల విలువ చేసే 68 పనులు పూర్తి చేశారు. ఆ పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.86 లక్షలు విడుదల చేసింది. దీంతో బిల్లులు డ్రా చేసుకు నేందుకు చేసిన పనులకు సంబం ధించి అన్ని రికార్డులు, బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే వారి ఖాతాలకు నిధులు మాత్రం జమకా లేదు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు లబో దిబోమంటూ మిగిలిన పనులు చేసేందుకు విముఖత చూపుతున్నారు. అయితే ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకునేందుకు ప్రతి వార్డులో అభివృద్ధి చూపించాలని అధికారపార్టీ నేతలు తహతహలాడుతూ మరో 52 పనులు ప్రారంభించినా అవి పూర్తి కాలేదు. ఇంకా 135 పనులు చేపట్టలేదు.

● ముందుగానే ఫొటోల అప్‌లోడ్

సార్వత్రిక ఎన్నికల కోడ్ ఏ క్షణంలో నైనా వచ్చే అవకాశాలు ఉండటంతో పాలకులు, అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ముందు చేసిన పనులకు బిల్లులు వచ్చిన తర్వాత చేద్దామంటే ఎన్నికల కోడ్ వచ్చి ఎక్కడ అడ్డు తగులుతుందోనన్న ఆందోళన ఉంది. దీంతో ఎన్నికల కోడ్ అడ్డు తొలగించుకునేందుకు పట్టణంలో ఇప్పటి వరకు పనులు ప్రారంభించని వాటిని గుర్తించి అవి అవసరాన్ని బట్టి పనులు చేసుకునేలా పాలకులు, అధికారులు పథకం రూపొందించారు. ప్రతి రోడ్డు, కాలువ పనులకు వాటిని ప్రారంభించినట్లుగా ఎక్స్‌కవేటర్‌తో మట్టి కదిలించి, ఆ పనుల ఫొటోలను సచివాలయ సిబ్బంది ద్వారా తీయించి పనులు ప్రారంభమైనట్లుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పట్టణంలో అన్ని గడప గడప పనులు ప్రారంభమైనట్లుగా రికార్డులు సిద్ధం చేస్తున్నారు.

దువ్వూరు హెడ్ రెగ్యులేటర్ పనుల పరిశీలన


హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి

సంగం, ఫిబ్రవరి 27: సంగం బ్యారేజీ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న దువ్వూరు కాలువ హెడ్ రెగ్యులేటర్ పనులను మంగళవారం తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణమూర్తి పరిశీలించారు. 1882లో నిర్మించిన ఈ కాలువ హెడ్‌రెగ్యులేటర్ పనులు చివరి దశలో ఉన్నాయి. కార్యక్రమంలో కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులు ఆనంద్, డీఈ అనిల్ కుమార్, ఏఈలు ఉన్నారు.

డిగ్రీ పరీక్షకు 566 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 27: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ ఒకటవ సెమిస్టర్ పరీక్షకు 566 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు 7,797 మంది విద్యార్థులకు గాను 7,231 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

సోమిరెడ్డిపై హత్యాయత్నం
వైసీపీ అరాచకాలకు పరాకాష్ట : బీద

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం వైసీపీ అరాచకాలకు పరాకాష్ట అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో గూండా రాజ్యం సాగుతోందని, సోమిరెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి మంత్రి కాకాణి బాధ్యత వహించాలన్నారు. వైసీపీ మూకల ఆగడాలకు హద్దు లేకుండా పోతోందని వి మర్శించారు. రోజుకో దాడి జరుగుతున్నా పోలీసు వ్యవస్థ చేవచచ్చి చూస్తోందని ఆరోపించారు. సోమిరెడ్డిపై దాడి చేసిన వారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, టీడీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఉప సంహరించుకో వాలని డిమాండ్ చేశారు.

'అపోలో'లో నూతన టెక్నాలజీతో పర్యవేక్షణ

- డాక్టర్ శ్రీరాం సతీష్, డాక్టర్ భక్తవత్సలరెడ్డి


నూతన టెక్నాలజీ సేవలను వివరిస్తున్న డాక్టర్ శ్రీరాం సతీష్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 : నెల్లూరు అపోలో ఆసుపత్రిలో రోగుల ఆరోగ్య పర్యవేక్షణ కు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కనెక్టెడ్ కేర్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ ద్వారా రోగులపై 24 గంటలు పర్యవేక్షణ ఉంటుందని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా హెచ్చరికలు జారీ చేస్తుందని చెప్పారు. కనెక్టెడ్ కేర్ సేవల వ్యవస్థ ఎలా పనిచేస్తుందో చేసి చూపించారు. గుండె వైద్య నిపుణుడు భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ గుండె వ్యాధిగ్రస్తులకు ఇలాంటి సేవలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చీఫ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ కనెక్టెడ్ కేర్ ప్రోగ్రామ్ అమూల్యమైందని, దీని ద్వారా అత్యుత్తమ సేవలు అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి నెల్లూరు యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడిలో ఆరుగురిపై కేసు


మాట్లాడుతున్న రామిరెడ్డి

మనుబోలు, ఫిబ్రవరి 27: కట్టువపలిలోని వైసీపీ, టీడీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య సోమవారం సాయంత్రం జరిగిన పరస్పర దాడుల్లో ఆరు మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అజయ్ కుమార్ తెలిపారు. వైసీపీ కార్యకర్త బల్లి వెంకటయ్య తాను ఇంట్లో నుంచి మోటర్‌సైకిల్‌పై వెళ్తుండగా టపాకాయలు పేల్చడం ఆపమని కోరగా అసభ్యకర పదజా లంతో కులం పేరుతో దూషిస్తూ కర్రలు, రాళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేసినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేంద్ర, సునీల్, పిడూరు మల్లికార్జున్‌రెడ్డి, దువ్వూరు శేషరెడ్డి, బల్లి శ్రీనివాసుల మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశామన్నారు. అలాగే తమ నాయకుడు సోమిరెడ్డి కట్టువ పల్లిలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహిస్తుండగా బల్లి వెంకటయ్య ఫ్లెక్సీలు చించివేసి గడ్డపార తిప్పుతూ హత్యాయ త్నానికి ప్రయత్నించినట్లుగా టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటయ్యపై కేసు నమోదు చేశారని వివరించారు. అలాగే గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 27: జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ్‌చిట్స్ శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించి నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు శాఖల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఏజెంట్ రిక్రూట్‌మెంట్, ఏజెంట్ యాక్టివేషన్, బిజినెస్ డెవలప్‌మెంటు సిబ్బంది పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 32 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు.

దాడి కేసులో ఒకరిపై కేసు నమోదు

అల్లూరు, ఫిబ్రవరి 27 : దాడి కేసులో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పురిణికి చెందిన పోకల వేణు కుమార్తెకు కలిగిరి మండలం కాగుటూరు మజరా జిర్రావారిపాలెంకు చెందిన గుంటుపల్లి బ్రహ్మాజితో వివాహమైంది. భర్త తరచూ వేధింపులకు గురి చేస్తుండడంతో పుట్టింటికి చేరుకున్న కుమార్తె వద్దకు బ్రహ్మాజి రావడంతో కోపోద్రిక్తుడైన పోకల వేణు అతని భార్య ఆదిలక్ష్మమ్మలు అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బ్రహ్మాజి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో దాడికి పాల్పడిన పోకల వేణుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

32 మద్యం సీసాల పట్టివేత

అల్లూరుకు చెందిన మలిశెట్టి వెంకట శేషయ్య అక్రమంగా 32 మద్యం సీసాలు తరలిస్తుండగా మంగళవారం పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



పల్స్ పోలియో శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ స్వప్న

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27: వచ్చే నెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్, ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్ హెచ్‌పీలు, పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చారు. మండలాన్ని రెండు రూట్లుగా విభజించి 18 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశా మన్నారు. మొత్తం 1,597 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంగయ్య, సీడీపీవో పచ్చవ లావణ్య, సీహెచ్‌వో ఓంకా రయ్య, ఆరోగ్య సిబ్బంది ఖాజామొహిద్దీన్, అరుణకుమారి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమంపై ఉపాధ్యాయులు, ఆశా, హెల్త్ స్టాఫ్, వాలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. మండలంలో 0-5 సం వత్సరాల పిల్లలు 1,932 మంది ఉండగా వారికోసం గ్రామాల వారీగా 38 బూత్‌లు, బస్టాండ్ నందు ఒక బూతు, మొబైల్ బూతు ఒకటి ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈవో మస్తాన్‌వలి, మజీద్, రియాజ్, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఆగని విద్యుత్ చోరీలు

చేజర్ల, ఫిబ్రవరి 27: మాముడూరు సమీపంలోని ఫ్యాక్టరీ కోసం ఆదురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 15కిలో మీటర్లు 33 కేవీ లైన్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట ఫ్యాక్టరీ మూసివేయడంతో ఆ లైన్‌కు కరెంట్ సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న దొంగలముఠా వైర్లు దొంగలించే పనిలో నిమగ్నమయ్యారు. వాహనాలలో రావడం స్థంబాలను పగలకొట్టడం.. 33కేవీ లైనుకు సంబంధించిన వైరును తీసుకెళ్లడం ఇదే తంతుగా మారింది. చోరీలను తెలుసుకున్న విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ మన్మదరావు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. గతంలో జరిగిన నాలుగు చోరీలపై చేజర్ల స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.



స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

చోరీల సమయంలో పంటలు ధ్వంసం..

విద్యుత్ స్తంభాల లైన్లు పొలాల్లో ఉండడంతో దొంగలు పంటలను కూడా ఇష్టానుసారంగా తొక్కిస్తూ రైతులకు తీవ్రనష్టం కలిగిస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికొచ్చిన సమయంలో ఇలా జరుగుతండంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా జరుగుతన్న చోరీలపై అధికారులెవరూ నోరు మెదపడంలేదు. కాలువలు, నదుల వెంబడి ఉండే స్టాటర్లు, మోటార్లు, వైర్లు, రోడ్డుకు లోపల తోటల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రినే టార్గెట్‌గా దోపిడీ చేస్తూ దొంగలు పోలీసులకు సవాళు విసురుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అంజేస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: మున్సిపాల్టీ పరిధిలోని సమస్యలను పరిష్కరించే దిశగా సత్వర చర్యలు చేపట్టాలని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సంధాని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారానికై సీపీఎం పార్టీ ఎల్ఆర్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో మంగళవవారం కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్‌ఆర్‌పల్లి నుంచి చావిడి సెంటర్, రామాలయం వీధి వరకు మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మాసుం డ్రైనేజీ కాలువ మరమ్మతులకు నోచుకోక పోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువను శుభ్రపరిచి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఎస్ఎంబీ పార్కులో ముళ్లపొదలను తొలిగించి పార్కును వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు శ్రీహరి, కృష్ణమోహన్, కాలేషా పాల్గొన్నారు.

20వ వార్డులో కమిషనర్ పర్యటన

ఆత్మకూరు, ఫిబ్రవరి 27: స్థానిక 20వ వార్డులో మంగళవారం మున్సిపల్ కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి వార్డు పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు ఉన్నట్లు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్‌ఐ షేక్ ఖాసీం, మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఆడిట్ అధికారి హరివర్మ

ఉదయగిరి, ఫిబ్రవరి 27: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డులను మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ మార్కెటింగ్ ఆడిట్ అధికారి హరివర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో జరిగిన క్రయవిక్రయాలపై తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ విజయరాణి బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందన్నారు. క్రయవిక్రయాలపై సిబ్బంది తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను తెలియజేశారు.

కాకర్ల విజయానికి కృషి

వరికుంటపాడు, ఫిబ్రవరి 27: నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని యువ నాయకుడు పేరం సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే నిస్వార్ధ సేవా గుణం కలిగిన కాకర్లను గెలిపిస్తే భవిష్యత్తులో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు.

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న దంపతులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 27: నందిపాడు సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పోతిగుంట శ్రీలక్ష్మి వెంకటరత్నం ఛారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో 41 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయాన్ని నిర్మించారు. తొలిరోజు వేదపండితులు గంగానయనం, గణపతి, పుణ్యాహవచనం, పంచగవ్య, రక్షాబంధనం, మాతృక, మంగళ పూజ కార్యక్రమాలతోపాటు అభిషేకాలు, అర్చనలు చేశారు. 28న కాల పూజ, హోమాలు, గ్రామోత్సవం, 29న శిఖర, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాగునీటి కోసం బతిమలాడాల్సిన దుస్థితి

● అధికారులపై బీజేపీ మండల నాయకుల ఆగ్రహం



అడ్డుకట్ట వేసిన బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

చేజర్ల, ఫిబ్రవరి 27: సోమశిల దక్షిణ కాలువ నుంచి వచ్చే నీటిని కోసం మండల రైతులు బతిమలాడాల్సిన దుస్థితి ఏర్పడిందని బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనే యరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగ ళవారం ఆయన పార్టీ నాయకులు, స్థానిక రైతులతో కలసి సోమశిల దక్షిణ కాలువ 24ఎల్ ష ట్టర్ వద్ద నీటి ప్రవాహాన్ని పరి శీలించారు. గొల్లపల్లి, పాడేరు చెరువులు కింద రెండు వందల ఎకరాలపైగా వరి పంటసాగు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం చెరువులో నీరు ఉన్నందునే వలనే నీరు వదలేదని అధికారులు చెప్పడం విచారకరం అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యకు పరి ష్కారిస్తామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

మరమ్మతులకు నోచని చేతిపంపు



హెడ్ ఊడిపోయి కిందకు వాలిపోయిన చేతిపంపు

సంగం, ఫిబ్రవరి 27: ఈ చిత్రంలో కనిపించే చేతిపంపు మర్రిపాడు గిరిజన కాలనీలోనిది. 70గిరిజన కుటుంబాలుండే చోట ఉన్నది ఒకే చేతిపంపు. ఏడాదిపైపే చేతిపంపు చెడిపోయినా మరమ్మతుకు నోచుకో లేదు. ఇంటింటికీ కుళాయి వేసినా జలజీవన్ మిషన్ మోటార్లు పాడవడంతో రోజంతా నీటి సరఫరా కాలేదు. ఇలాంటి సమయంలో చేతిపంపు ఉంటే నీటి సమస్య తలెత్తదని స్థానికులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్ తదితర ప్రాంతాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు లు ఏర్పాటు చేసి ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వ్యాపార దుకాణాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కావలి, ఫిబ్రవరి 27 : వ్యాపార సంస్థల యజమానులు తమ సంస్థలు, దుకాణాలను ఈ నెల 29 తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కావలి సహాయ కార్మిక అధికారి ఎన్.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

● రూ.1.20 లక్షల రికవరీకి ఆదేశం





సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు, ఖాళీగా ఉన్న కుర్చీలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 27 : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. ఎంపీటీసీలు, సర్పంచులు తదితర ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కాలేదు. 2022-23లో 21 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో జరిగిన అవకవతకలకు సంబంధించి రూ.1.20 లక్షల రికవరీకి అధికారులు ఆదేశించారు. కూలీలకు నగదు చెల్లించి మస్టర్లలో వేలి ముద్రలు, సంతకాలు లేకపోవడం, ఒకరి పేరుపై మరొకరు పనులకు హాజరుకావడం, రికార్డుల ప్రకారం నాటిన మొక్కలు లేకపోవడం, పని ప్రదేశాలలో నేమ్‌బోర్డులు పెట్టకుండానే బిల్లులు తీసుకోవడం, మస్టర్లు, రికార్డులలో వివరాలు సరిగా లేకపోవడం గుర్తించామని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. అలాగే పలు గ్రామాల్లో పనుల కొలతల్లో చిన్నచిన్న వ్యత్యాసాలు, నిర్దేశించిన రోజులకంటే ఎక్కువ రోజులు కూలి చెల్లించినట్లు తెలిపారు. రికార్డుల ప్రకారం జామ, నిమ్మ మొక్కలు క్షేత్రస్థాయిలో లేవని తెలిపారు. ఈ అక్రమాలలో రూ.1,20,000 రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌క్యూసీ వేణు, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపీపీ పొనుగోటి మౌనిక, ఎస్‌టీఎమ్ సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ బుజ్జి, ఎంపీడీవో రఫీక్ అహ్మద్, ఏపీవో ఉమామహేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీషా పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు



సభలో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 27: బీసీలకు గుర్తింపు తీసుకువచ్చిన పార్టీ తెలుగుదేశం అని పలువురు బీసీ నేతలు చెప్పారు. కావలి టీడీపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం పట్టణ, రూరల్ మండలాలకు సంబంధించి జయహో బీసీ సభ జరిగింది. పలువురు బీసీ నేతలు మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా టీడీపీ ప్రాధాన్యం కల్పిస్తే ఆ తర్వాత అనేక పార్టీలు ఓట్ల కోసం బీసీల జపం చేస్తున్నాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని పాదయాత్రలో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను అణగదొక్కారన్నారు. బీసీల రిజర్వేషన్‌ను 34 నుంచి 24 శాతంకు తగ్గించి 16,800 మందిని రాజకీయ పదవులకు దూరం చేశారన్నారు. బీసీల బతుకులు మారాలంటే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 50 శాతం పదవులు బీసీలకు కేటాయిస్తామన్నారు. రాష్ట్ర జిల్లా బీసీ నేతలు చెంచలబాబు యాదవ్, కొండూరు పాలిశెట్టి, పీఎల్‌రావు, కప్పిర శ్రీనివాసులు, పోట్లూరు శ్రీనివాసులు, గంజం రాగవేంద్ర, రవీంద్ర బాబు, ఉప్పు భాస్కర్, కంచర్ల ఘనేంద్ర, షేక్ సుభాన్, బుడుగు వెంకయ్య, ఆవుల రామకృష్ణ, బాలగురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ



మహిళతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ సాధ్యమని, రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో తొలి అడుగు అటువైపే పడుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జనార్ధన కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి టీడీపీ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

క్రీడాకారులతో వైసీపీ బంతాట : రాష్ట్రంలో అధికార వైసీపీ నేతలు క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఒక వైసీపీ నేత కుమారుడిని మందలించాడన్న కారణంతో రాష్ట్ర రంజీ కెప్టెన్‌గా వ్యవహరించిన హనుమ విహారిని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించడం చూస్తుంటే రాష్ట్రంలో వైసీపీ నేతల దందా ఏస్థాయిలో ఉందో అర్థమవుతున్నదన్నారు. హనుమవిహారికి మంత్రి రోజా వెంటనే క్షమాపణలు చెప్పి అతనికి తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

2వ వార్డులో వైద్యశిబిరం : ఒంగోలులోని చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పట్టణంలోని 2వ వార్డులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో కాలనీవాసులకు వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. క్యాంప్ నిర్వాహకులు వైఎల్ నారాయణ, సహజానందం, సిబ్బందిని నాగేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నార్నె రోశయ్య, కూనం నరేంద్ర, పొడపాటి మహేష్ పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలిసిన ఇంటూరి రాజేష్



వేమిరెడ్డిని కలిసిన రాజేష్

కందుకూరు, ఫిబ్రవరి 27: వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. పలువురు స ర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీపీలు, అధికసంఖ్య లో నాయకులు, కార్యకర్తలను వెంట తీసుకెళ్లి వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి రాజేష్‌తో చర్చించినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దివి శివరాం సోదరుడు దివి రమేష్‌తోనూ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పులివర్తి బసవయ్యనాయుడు, పొడపాటి శ్రీను, ఆవుల నరసింహారా వు, పొడపాటి వంశీ, అమ్మనబ్రోలు రమేష్, ఎం శ్రీహరి, మానం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశ చరిత్ర యువతకు స్ఫూర్తి కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్‌శంకర్

కావలిటౌన్, ఫిబ్రవరి 27: భారతదేశ చరిత్ర యువతకు స్ఫూర్తి కావాలని ఆంధ్రకేశరి యూనివర్శిటీ (ఒంగోలు) రిజిస్ట్రార్ టీ హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వీఎస్‌యు పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన యు వసంవాద్ ఇండియా 2047 అనే కార్యక్రమంపై జరిగిన సదస్సులో ప్రత్యేక అతిథులుగా హరిబాబుతో పాటు పీలేరు ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొఫెసర్ వెంకటరమణయ్య, నెల్లూరు యువకేంద్ర జిల్లా కన్వీనర్ మహేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ పాల్గొని మాట్లాడారు.

డీఎస్పీ వసతి గృహం పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

బిట్రగుంట, ఫిబ్రవరి 27: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కావలి డీఎస్పీ వెంకటరమణ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. బాలుర వసతి గృహంలోని వసతుల విషయం వార్డెన్ అనితను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఏప్రిల్ నెలలో జరుగు సార్వత్రిక ఎన్నికల నిర్వాహణ భద్రత విషయమై ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అదనపు పోలీసు బలగాల వసతి ఏర్పాటుకై పరిశీలిస్తునట్లు తెలిపారు. ఆయన వెంట కావలి రూరల్ సీఐ నాగభూషణం, స్థానిక ఎస్సై శేఖర్‌బాబు ఉన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



బహుమతులు అందజేస్తున్న మహేంద్రరెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 27 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో మంగళవారం రామకృష్ణా విద్యాసంస్థల క్రీడా మైదానంలో బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహించారు. బాలురకు వాలీబాల్, బాలికలకు ఖోఖో క్రీడలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కె.మురళీమోహన్‌రాజు, రవి, పీడీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ హరి, ఎస్.వి.సత్యనారాయణ, బోయిన వినయ్ పాల్గొన్నారు.

నేడు అల్లూరు మండల సమావేశం

అల్లూరు, ఫిబ్రవరి 27 : మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 27 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో వీఆర్ కోట మన్నేరులో సోమవారం అర్ధరాత్రి దాడులు చేసి ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను, ముగ్గురు డ్రైవర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రేపు రాజగోపురం కలశ ప్రతిష్ఠ

కందుకూరు, ఫిబ్రవరి 27: పట్టణంలోని స్కంధపురి జనార్ధనస్వామి ఆలయంలో ఈనెల 29న రాజగోపుర కలశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహకాధికారి భైరాగిచౌదరి, ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందంలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ టీటీడీ వేదపండితులు వేదాంతం విష్ణుభట్టాచార్యులు, శ్రీధర్‌స్వామిలు నేతృత్వంలో వేకువజాము నుంచి కార్యక్రమాలు ప్రారంభమై ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణం, వీధి ఉత్సవం, ధ్వజారోహణ జరుగుతుందని తెలిపారు.

ఇండిపెండెంట్‌గా పసుపులేటి పోటీ

కావలిటౌన్, ఫిబ్రవరి 27: కావలి నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధిపతి పసుపులేటి సుధాకర్ పోటీ చేస్తారని ఆయన సోదరుడు పసుపులేటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గాయత్రినగర్ ట్రంకురోడ్డులోని పసుపులేటి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక స్టేడియం మైదనంలో ఇటీవల జరిగిన పసుపులేటి బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు హాజరవడం పసుపులేటిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని నినదించడం ఆయన చేసిన సేవా కార్యక్రమాలవల్లేనన్నారు. పసుపులేటి అనుచరులు రాంబాబు, మైనంపాటి జగదీష్, శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ పసుపులేటి పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా రూ.కోట్ల సొంత నిధులతో పల్లెలో సేవా కార్యక్రమాలు చేశారన్నారు.

దక్షిణ ముఖ ఆంజనేయుడికి ఆకు పూజ

బిట్రగుంట, ఫిబ్రవరి 27: బోగోలు చెన్నకేశవస్వామి ఆలయంలో దక్షిణ ముఖ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక ఆకుపూజ జరిగింది. మానికల సుబ్బరామయ్యాలలితమ్మ, సురేష్-లక్ష్మీఐశ్వర్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రాచీన ఆలయ జీర్ణోద్ధర నూతన ట్రస్టీగా బచ్చు కృష్ణకుమార్‌ను దేవాదయ శాఖ నియమించింది. ట్రస్టీల సూచనల మేరకు స్వామివారికి మొదటిసారి ఆకు పూజలు నిర్వహించారు.

టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

కావలి, ఫిబ్రవరి 27: రెడీమేడ్ దుస్తులు రాకతో టైలర్స్‌కు జీవన భృతి కష్టంగా మారినందున టైలర్స్ సమస్యలు పరిష్కరించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కావలి టైలర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమేష్, ఉపాధ్యక్షుడు మాల్యాద్రి, కోశాధికారి వేణు, సంయుక్త కార్యదర్శి ఆలా శ్రీనాథ్‌లు మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తులు వచ్చిన తర్వాత టైలర్స్ వ్యవస్థే దెబ్బతిందన్నారు. 45 ఏళ్లు దాటిన టైలర్ల పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. కావలిలో టైలర్స్ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు.

టైలర్స్ డేను విజయవంతం చేయాలి : టైలర్స్‌డే సందర్భంగా బుధవారం కావలిలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏవీఎస్ కల్యాణ మండపం వరకు జరిగే ర్యాలీ, ఆ తర్వాత జరిగే సభలో పట్టణంలోని టైలర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు మాలకొండారెడ్డి, రెహమాన్, శ్రీహరి, అల్తాఫ్, జమీర్, రసూల్, నారాయణరెడ్డి, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చర్యలపై హర్షం

లింగసముద్రం, ఫిబ్రవరి 27 : పార్టీ ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేయడం అభినందనీయమని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయంపుల నిరోధక చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పేర్కొన్నారు.

ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

కావలిటౌన్, ఫిబ్రవరి 27: ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవంను పురస్కరించుకుని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో మంగళవారం రత్నమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. ప్రసాదరావు తన సతీమణి దివంగత రత్నమ్మ పేరిట ఫౌండేషన్ ప్రారంభించి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, అజీత్‌బాబు, జీ.సురేంద్ర, పాల్గొన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీని సందర్శించిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 27 : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదరవల్లి మంగళవారం సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లు, ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్స్‌లను పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్స్ ఐస్ ప్యాక్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. వైద్య సిబ్బంది ఈ నెలలో రెండు కాన్పులు చేశామని తెలిపారు. కాన్పులు మరిన్ని జరిగేవిధంగా చూడాలని, గర్భిణులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ నవీన్, హెచ్‌ఈవో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, మురళి, ఫార్మసిస్టు చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 27: మండలంలోని రామచంద్రాపురం గిరిజన కాలనీలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సామాజిక వేత్త గండికోట సుధీర్‌కుమార్ మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

వాళ్లు వైసీపీ కార్యకర్తలే..

- ఒత్తిళ్లతోనే మారుతున్నారు
- టీడీపీ నాయకుల ఆరోపణ

మనుబోలు, ఫిబ్రవరి 27: మనుబోలులో ఆదివారం టీడీపీ నుంచి వైసీపీలో చేరిన వాళ్లు టీడీపీ కార్యకర్తలు కారని, వైసీపీ పార్టీ వాళ్లేనని టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధానకార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తుంటే అడిగినందుకు వైసీపీ నాయకుల సహకారంతో బందిలదొడ్డి గోడను పడగొట్టి ఆక్రమించాడని, అందుకే ఆయన వైసీపీలో చేరాడన్నారు. కన్నసుబ్బయ్యతో పాటుగా మరికొందరు దేవాంగులు, గిరిజనులు కూడా టీడీపీ కార్యకర్తలు కాదని, ఆధారాలను చూపించినట్లు తెలిపారు. 70 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరలేదన్నారు. మాజీ ఉపసర్పంచ్ దండు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి చెందిన 7 కుటుంబాల మాత్రమే చేరారన్నారు. ఆ నష్టాన్ని తాము భర్తీ చేస్తామన్నారు. చాలా మంది ఒత్తిళ్లకు తలొగ్గి పార్టీ మారిపోయారని, టీడీపిని మంచి మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కట్టువపల్లిలో తమ నాయకుడు సోమిరెడ్డిపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీలకతీతంగా అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయపాటి కిరణ్‌కుమార్, మారంరెడ్డి రమణారెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రావుల అంకయ్యగౌడ్, కలికి సుధీర్‌రెడ్డి, పిడూరు సురేష్, రేవూరు సుమంత్, బోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బండికట్టు రవీంద్రబాబు, పుట్ట మస్తాన్, రమేష్ తదితరులున్నారు.

కోడిగుడ్డుపై రామన్ సూక్ష్మచిత్రం



కోడిగుడ్డుపై రామన్ సూక్ష్మ చిత్రం

ముత్తుకూరు, ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కోడిగుడ్డుపై సర్ సీవీరామన్ సూక్ష్మ చిత్రాన్ని రూపొందించి శుభాకాంక్షలు తెలిపారు ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మనాభం. సైన్స్ మానవ జీవనంలో కీలకంగా మారిందన్నారు.

ప్రకటన

నా క్లయింట్స్ అయిన 1. ఉప్పలపాటి కుసుమ భర్త మాదవరపు సుధాకర్‌రావు 2. మాదవరపు వృత్తి తండ్రి మాదవరపు సుధాకర్‌రావు, నాగమాంబాపురం గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా అనువారు ఇచ్చిన వివరముల మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా- నా క్లయింట్స్ బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో చేరిన వచ్చేరు మజరా బుచ్చిరెడ్డిపాళెంలో సర్వే నెం.149/1, 149/2లలో 6వ వార్డు, 12వ బ్లాకు, దొడ్ల రామచంద్రారెడ్డి నగరులో ఉత్తరపు ప్రక్క డోరు నెం. 6-12-276కు గల ఇంటికి సమీపంలో నెం.385కు పాటు విస్తీర్ణం 25 అంకణములు లేక 200 చగలు స్థలమును గంగపట్నం దేవసేనమ్మ భర్త గంగపట్నం శ్రీనివాసులు అనువారి వద్ద నుండి రిజిస్టర్డు విక్రయపత్రం తేది:20-01-2024 డాక్యుమెంటు నెం.276/2024 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లలో ఒకటైన అనగా రిజిస్టర్డు విక్రయపత్రం తేది:18-10-2023 డాక్యుమెంటు నెం.5510/2023ను జెరాక్స్ తీయుటకు నిమిత్తం తే.20-02-2024న నా క్లయింట్స్‌లో 1వ వారు తన నివాసం నుండి బుచ్చిరెడ్డిపాళెం సెంటర్‌లో వున్న జెరాక్స్ షాపుకు పోవుచుండగా మార్గమధ్యములో ఒరిజినల్ లింకు డాక్యుమెంటు పోయినది. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.5510/2023ను ఎవ్వరైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అది చెల్లనేరదు. అది నా క్లయింట్స్‌ను బద్ధగించదు.

M.Mushtaq Ahmed., M.B.A., B.L.,
Advocate, D.No.23-1-957 (New), 23-1-82 (Old),
Mulapet, Nellore-524003. (A.P)
Mob: 94414 43110, 94920 02956

అద్దె గృహాల్లో వ్యభిచారం!

- కసుమూరులో విచ్చలవిడిగా..
- తెలిసినా కూడా తెలియనట్లుగా పోలీసులు ?

వెంకటాచలం, ఫిబ్రవరి 27: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలి దర్గా వద్ద ఉన్న అద్దె గృహాలు వ్యభిచారానికి నిలయంగా మారాయి. సుమారు 400 వరకు అద్దె గృహాలుండగా వాటి నిర్వాహకులు 30మందికి పైగా ఉన్నారు. వీరిలో కేవలం ఐదు, ఆరుగురు మాత్రమే డబ్బులు ఎక్కువగా వస్తాయన్న అత్యాశతో వ్యభిచారానికి గృహాలు అద్దెకు ఇస్తున్నారు. వీరి కారణంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు దర్గా ప్రాంతం అపవిత్రం అవుతుండడం బాధకరమని స్థానికులు, భక్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రతినిత్యం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు దర్గాకు వస్తుండటంతో సందడి వాతావరణం నెలకొని ఉంటుంది. దీనిని అదునుగా తీసుకుంటున్న ఐదు, ఆరుగురు అద్దె గృహాల నిర్వాహకులు నెల్లూరు నగరం, చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుండి వచ్చే కళాశాలల విద్యార్థులు, ప్రేమికులకు వ్యభిచారం చేసేందుకు గృహాలు అద్దెకు ఇస్తున్నారు. మామూలుగా దర్గాకు వచ్చే భక్తులకు గృహాలు అద్దెకు ఇచ్చినట్లయితే రోజుకి రూ.300 నుండి రూ.1000 వరకు బాడుగ వస్తుంది. కానీ అదే వ్యభిచారానికి ఇచ్చినట్లయితే ఒక్క గంటకు రూ.2 వేలు నుంచి రూ.3 వేలకు పైగా అద్దె వస్తుందన్న ఆశతో పవిత్రమైన ప్రాంతాన్ని వ్యభిచారానికి ఇచ్చి అపవిత్రం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రస్తుతం వ్యభిచారానికి అద్దె గృహాలు ఇస్తున్న ఐదు, ఆరుగురిపై గతంలో వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదై జైలుకు కూడా వెళ్లారు. కానీ వీరిలో మాత్రం ఎలాంటి మార్పు రాకపోగా మునుపటిలాగే వ్యభిచారానికి అద్దె గృహాలు ఇస్తున్నారని స్థానికులు పెదవి విరుస్తున్నారు. స్థానికులు ఎవరైనా వీరిని ప్రశ్నిస్తే పోలీసు స్టేషన్‌లో భారీగా మామూళ్లు ఇస్తున్నట్లు, పోలీసులకు ఫోన్ చేసిన తమకు ఏం కాదని వారు బదులిస్తున్నట్లు కసుమూరులో ప్రచారం జరుగుతోంది. వ్యభిచారంపై స్థానికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోగా తమకు ఏం పట్టనట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

బుచ్చిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 27: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పలు పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు మంగళవారం పరిశీలించారు. స్థానిక డీఎల్ఎన్ఆర్ హైస్కూలు, రాఘవరెడ్డి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసేందుకు చర్చించారు. వారి వెంట ఎంఈవో పీవీ.రత్నం, పలువురు బీఎల్‌వోలు ఉన్నారు.

గీతాంజలి విద్యార్థికి కాంస్య పతకం



జెర్మియా శోభిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సందీప్

కోవూరు, ఫిబ్రవరి 27: స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విద్యార్థి జెర్మియా శోభిత్ ఇటీవల నాందేడ్‌లో జరిగిన పెన్‌కాప్ సిలాట్ జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించారు. ప్రతిభ చాటిన జెర్మియా శోభిత్‌ను మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ మాట్లాడుతూ విశేష ప్రతిభ కనబరిచిన తమ విద్యార్థి జెర్మియా శోభిత్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అస్సాం రైఫిల్స్‌లలో ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ అశోక్‌కుమార్, సహాయ పీడీ హరిప్రసాద్, కోశాధికారి విజయశంకరరెడ్డి, వివిధ శాఖాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలంరెడ్డి పరామర్శ

కోవూరు, ఫిబ్రవరి 27: స్థానిక దాసరిపాళెంలో నివా సముంటున్న టీడీపీ కార్యకర్త టైలర్ కృష్ణ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, బాల రవి, చామంతిపురం గౌతమ్ కుమార్, ఉయ్యూరు వేణు, సాధిక్, అహమ్మద్ బాషా, తదితరులున్నారు. అలాగే టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి తన అనుచరులు ఇంటూరు విజయ్, పూల యశ్వంత్‌లతో కలిసి నివాళులర్పించారు.

సీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర ఆరోగ్య బృందం



సీహెచ్‌సీని పరిశీలిస్తున్న కేంద్ర వైద్య ఆరోగ్య బృందం

పొదలకూరు, ఫిబ్రవరి 27: చాటగొట్లలో ఇటీవల కోళ్ల చనిపోవడంతో బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణకు కేంద్ర వైద్యఆరోగ్య శాఖ బృందం మంగళవారం పొదలకూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ వైద్య ఆరోగ్యశాఖ ఫర్ డిసీజెస్ కంట్రోల్ నుంచి డాక్టర్ స్మితసింగాల్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడి సన్ డాక్టర్ శ్రేయశర్మ, డాక్టర్ వరుణ్‌లు సీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలు, అందు బాటులో మందులు, లాబరేటరీలో చేస్తున్న రక్తపరీక్షలు పరిశీలించారు. పది రోజుల క్రితం చాటగొట్ల కోళ్ల ఫారాల సమీపంలోని వ్యక్తుల నుంచి సేకరించిన నమూనాల్లో బర్డ్ ఫ్లూ నెగిటివ్ వచ్చిం దన్నారు. మంగళవారం మరో 10 మంది వద్ద రక్తనమూనాలు సేకరించారు. ప్రజలెవరు భయపడాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా సర్వలెన్స్ వైద్యాధికారి భాస్కర్, స్థానిక వైద్యాధికా రులు డాక్టర్ నరసింహ రావు, ప్రసాద్, కిరణ్ రిషిత, శ్రీకావ్య, ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, ల్యాబ్ టెక్నిషియన్ కరిముల్లా, ముస్తఫా, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మపంటలో వచ్చే చీడపీడలపై అవగాహన

పొదలకూరు: పట్టణంలోని ఆర్‌బీకే- 3లో లెమన్ ట్రేడర్స్, గ్రామ ఉద్యానవన సహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు మంగళవారం నిమ్మ పంటలో వచ్చే చీడపీడలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీనీ, నిమ్మ పరిశోధన స్థానం తిరుపతి వారు ముద్రించిన నిమ్మ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పుస్తకానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన అధికారి ఎంవీ సుబ్బారెడ్డి, స్థానిక ఉద్యానవన అధికారి ఈ ఆనంద్, పొదలకూరు ఏవో గీతాకుమారి, ఏఎంసీ సెక్రటరీ నవీన్ కుమార్ రెడ్డి, పెద్దమల్లు రమణారెడ్డి, ట్రేడర్స్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 27 : నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం 1500 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం, అప్పల సుశీలమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ హాజరయ్యారు.

నెల్లూరును నెంబర్ వన్‌గా నిలుపుతా..!

- మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 27: దేశంలోనే నెల్లూరును నెంబర్ వన్ సిటీగా మారుస్తానని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నగరంలోని 49, 3 డివిజన్లలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి నారాయణ ప్రతి ఇంటికీ వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వంలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అధికారంలోకి రాగానే నగరంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, నారాయణ కుమార్తె సింధూర 44, 46 డివిజన్లలో పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ప్రజాగళం వినిపిస్తారా?

నేడు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం ● కార్పొరేటర్లు ప్రశ్నిస్తారా... లేదా ?



నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27 : నెల్లూరు కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారీ అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌ను బుధవారం కౌన్సిల్లో ప్రవేశపెట్టనున్నారు. రూ. 437,01,85,000 కోట్లతో తయారు చేసిన బడ్జెట్‌ను మేయర్ స్రవంతి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశం ముందుకు తీసుకురానున్నారు. ప్రజలపై భారం మోపుతూ, ఆదాయ వనరులను లెక్కకడుతూ తయారు చేసిన పద్దులో ఎక్కడా సామాన్యుడి ప్రయోజనం కానరావడం లేదు. అయితే కార్పొరేటర్లు ఎంతమాత్రం ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నిస్తారనేదానిపై సర్వత్రా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. డివిజన్లలో విలయతాండవం చేస్తున్న సమస్యలపై ప్రజా గొంతుకను వారు ఏమేరకు వినిపిస్తారో చూడాలి.

● అందరిచూపు కౌన్సిల్ వైపే..

అతి త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుండటంతో ఈ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌కు ఇదే చివరి బడ్జెట్ సమావేశం. దీంతో అందరిచూపు కౌన్సిల్‌పైనే ఉంది. ప్రజాప్రయోజనాలను పూర్తిగా విస్మరించి, ఆదాయమే తొలి ప్రాధాన్యతగా బడ్జెట్‌ను తయారు చేశారంటూ ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఖర్చులపై అనుమానాలు

గతేడాది రూ.423.49 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కార్పొరేషన్ అధికారులు అందులో పనులకు చేసిన ఖర్చులపై అనుమాలు ఉన్నాయి. తొలి నుంచి కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకం, కొనసాగింపుపై స్పష్టత లేదు. గతంలో రూ. 55 కోట్లు జీతాల కోసం కేటాయించగా, అందులో రూ.50 కోట్లు చెల్లించినట్లు చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మేయర్‌తోపాటు, కార్పొరేట ర్లకు పాలనపై అవగాహన కల్పించేందుకు రూ. 10 లక్షలు కేటాయించగా, అందులో రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నాల్గవ తరగతి ఉద్యోగులు, పారి శుద్ధ్య కార్మికులకు యూనిఫారాలకు రూ. 50 లక్ష లు కేటాయించగా అందులో రూ. 40 లక్షలే ఖర్చు చేశారు. అయితే యూనిఫారాల కోసం కార్మిక సంఘాలు ఆందోళన చేయడం గమనార్హం.

● జీవాల నియంత్రణకు రూ. 26 లక్షలట !

నగరంలోని రోడ్లపై మూగజీవాల సంచారాన్ని నిలువరించేందుకు రూ. 26 లక్షలు ఖర్చు చేసినట్లు తాజా బడ్జెట్‌లో చూపగా, కేటాయింపులు మాత్రం రూ.20 లక్షలే కావడం గమనార్హం. 2019 - 20ల్లో కొవిడ్ నివారణకు గత బడ్జెట్‌లో రూ.10 లక్షలు కేటాయించగా, రూ. 15 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు తాజా బడ్జెట్‌లో చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

● ప్రశ్నించే వారేరి ?

రూరల్ నియోజకవర్గ పరిధిలో 26 మంది కార్పొరేటర్లకుగాను 10 మంది (ఒక కోఆప్షన్) టీడీపీలో ఉన్నారు. సిటీ నియోజకవర్గంలో 28 మందిగాను ముగ్గురు అసమ్మతి గళం వినిపిసూ ఓ డిప్యూటీ మేయర్ వెనుక నడుస్తున్నారు. వీరుతప్ప కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలు ఇంకెవరైనా గళమెత్తుతారా? అన్నది ఆసక్తిగా మారింది.

ఎన్నికల నోటిఫికేషన్ రాగానే వైసీపీ సగం ఖాళీ

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 : ఎన్నికల నోటిఫికేషన్ రాగానే వైసీపీ సగం ఖాళీ అవుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి జోస్యం చెప్పారు. మంగళవారం 40వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో సిటీ నుంచి పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. వైసీపీలో భవిష్యత్తు లేదని గుర్తించిన నేతలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డివంటి వారు టీడీపీలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ సీట్లు గెలవటం ఖాయమన్నారు. ఓటమి భయం ముఖ్యమంత్రి జగన్‌ను వెంటాడుతోందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి రాజు, తమ్మల కృష్ణ, ఆమని, శర్వాణి, ధనలక్ష్మి, మురళి తదితరలు పాల్గొన్నారు.

కార్యకర్తల కోసమే వైసీపీ ప్రభుత్వ పాలన : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 27: దేశ ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తుంటే రాష్ట్రంలో మాత్రం వైసీపీ కార్యకర్తల కోసం జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ నాయకుడు పీ సురేంద్రరెడ్డి విమర్శించారు. నగరంలోని చిన్నబజారులో మంగళవారం బీజేపీ పోరుబాట కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఐదేళ్లలో రూ.5.50 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ ఖర్చు పెట్టారో వైసీపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛ భారత్ కింద రాష్ట్రంలో చెత్త సేకరణకు కేంద్ర ప్రభుత్వం వాహనాలు అందించిందని, అయితే ఆ బండ్లలో జగనన్న పాటలే వినిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిడతల రమేష్, జగన్మోహన్‌రావు, యశ్వంత్‌సింగ్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

వేమిరెడ్డికి పలువురి మద్దతు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 27 : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మంగళవారం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం మద్దతు తెలిపింది. ఆ సంఘం నాయకులు, సభ్యులు ర్యాలీగా వేమిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. అధ్యక్షుడు గుంజి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుంజి మనోహర్, కార్యదర్శి వల్లెపు వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు రమాతులసి తదితరు లు వేమిరెడ్డిని సత్కరించి మద్దతు ప్రకటించారు.

వీపీఆర్‌తోనే అడుగులు : కమలాకర్‌రెడ్డి



కమలాకర్‌రెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిసున్న కోటంరెడ్డి

నెల్లూరు రూరల్: ఆధ్యాత్మిక, ప్రజా సేవలకు ప్రతీకగా నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అధికార వైసీపీ అవమానకరంగా బయటకు వెళ్లేట్లు చేసిందని, ఆయన వెంటే తాను నడుస్తానని డీసీసీబీ మాజీ డైరెక్టర్, నెల్లూరు రూరల్లో వైసీపీ కీలకనేత కోడూరు కమలాకర్ రెడ్డి తెలిపారు. నెల్లూరులోని తన నివాసంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మార్చి 2వ తేదీన వీపీఆర్‌తోకలిసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. రాబోవు ఎన్నికల్లో వీపీఆర్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వేమిరెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. కాగా, కోటంరెడ్డి సోదరులు కమలాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా రూరల్ నియోజకవర్గంలో టీడీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో 31వ డివిజన్ అక్కచెరువు పాడు మాజీ సర్పంచ్ శనగల దయాకర్ మిత్ర బృందం టీడీపీ తీర్థం పుచ్చుకుంది. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తల కృష్ణ, కూకటి హరియాదవ్, బాణాల ఉదయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

అజీజ్‌తో ఎమ్మెల్యే కోటంరెడ్డి భేటీ

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 27 : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను హరనాథపురంలోని ఆయన నివాసంలో కలిశారు. శ్రీధర్‌రెడ్డిని రాబోవు ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో అజీజ్‌ను కలిసి సత్కరించారు. కోటంరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని ఈ సందర్భంగా అజీజ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు పాల్గొన్నారు.

అధినాయకుని నిర్ణయమే శిరోధార్యం

- జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 27: జనసేన పార్టీలో సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధినాయకుడు పవన్ కల్యాణ్ నిర్ణయమే శిరోధార్యం అని జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల జనసేన నాయకులు, చిరంజీవి యువత నాయకులు, వీరమహిళలతో కలిసి అజయ్‌కుమార్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీట్లు ఆశించిన నాయకులు కొన్నిచోట్ల అసంతృప్తికి లోనయ్యారని, అయితే పవన్ కల్యాణ్ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, నలిశెట్టి శ్రీధర్, ఉయ్యాల ప్రవీణ్, బొబ్బేపల్లి సురేష్, కాశీరావు, వై రవికుమార్, కే కృష్ణారెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, మార్కెట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకులతో అర్చన

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 27 : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న అష్టలక్ష్మీ యాగంలో 9వరోజు మంగళవారం ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో అర్చన జరిగింది. మహిళలు సింధూరంతో శ్రీరామ నామాన్ని తమలపాకులపై రాశారు. అష్టలక్ష్మీ పీఠం ఆధ్వర్యంలో పీతాంబరం రఘునాథచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేణుగోపాలస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాస్ అయ్యంగార్‌కి ఇరగవరపు రామానుజాచార్యులు స్మారక అర్చకరత్న అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగ అన్నదాన సమాజం ఉపాధ్యక్షుడు పాదర్తి శ్రీనివాస్, అర్బన్ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గుండ్లపల్లి పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు. కటకం హరి, కర్పూరం రమేష్, రంగనాథస్వామి దంపతులు పర్యవేక్షించారు.

రంగనాథుడి హుండీల ఆదాయం రూ.16.62లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 27 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు జరిగింది. గతేడాది నవంబరు 8 నుంచి మంగళవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.16,62,828 ఆదాయం వచ్చింది. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమానికి పరిశీలకుడిగా నర్రవాడ వెంగమాంబ పేరంటాళ్లు దేవస్థానం ఈవో వీ ఉషా, సహాయ కమిషనర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ డీ సాయిచైతన్య పర్యవేక్షకులుగా హాజరయ్యారు. రంగనాథ ఆలయం ఈవో డీ వెంకటేశ్వర్లు, ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, యరబాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత, దోమల నివారణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 : నగరంలోని 7వ డివిజన్‌లో మంగళవారం కిన్నెర ఫౌండే షన్ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. స్థానికుల కోరిక మేరకు కాలువల్లో పేరుకున్న మట్టిని తొలగించారు. దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు

- జీజీహెచ్ గైనకాలజీ హెచ్‌వోడీ గీతాలక్ష్మి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 27 : జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ అధ్యక్షతన మాతాశిశు మరణాల తగ్గింపు, మాతా శిశు ఆరోగ్య సంరక్షణపై మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయరాదని, ఒక వేళ చేస్తే గర్భం రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణీ అయిన వెంటనే ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల వద్ద పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రతినెల వైద్య పరీక్షలు విధిగా చేయించుకోవాలన్నారు. ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగితే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీప్రియ, హేమంత్, నిరంజన్, నవీన్, రామకృష్ణ, డెమో శ్రీనివాసరావు, మంజులమ్మ, ఎస్‌వో సహన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా ఎన్ఎంసీ సూపరింటెండెంట్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27 : చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా నెల్లూరు కార్పొరేషన్‌లో సూపర్‌డెంట్‌గా పని చేస్తున్న బీ నాగేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు తిరుపతి మున్సిపల్ అదనపు కమిషనర్ కుప్పం ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆ స్థానంలోకి తాజాగా నాగేశ్వరరావును బదిలీ చేసింది.

పోలింగ్ కేంద్రాల్లో అసౌకర్యాలు గుర్తించండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27 : నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో నెలకొన్న అసౌకర్యాలను గుర్తించి పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబరులో అధికారులతో సమీక్షించారు. ఓటర్లకు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం ఓటరు జాబితా తయారీపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

మద్యనిషేధంపై మడమ తిప్పిన జగన్

- టీడీపీ నగరాధ్యక్షుడు మధు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 27 : మద్యనిషేధం చేసిన తరువాతే ఓట్లడుగుతానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పి మడమ తిప్పాడని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్య నిషేధమంటూ ధరలు మూడు రెట్లు పెంచారన్నారు. 57 నెలల పాలనలో నాసిరకం మద్యం అమ్మకాలతో వచ్చిన ఆదాయం దాదాపు రూ. లక్ష కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు తీసుకెళ్లాడని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగి సుమారు 35లక్షల మంది అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారని వారిలో 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే జరుగుతున్నాయని, డిజిటల్ పేమెంట్స్ ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు ఆదినారాయణరెడ్డి, మాల్యాద్రి, నాని, వేణు, కిన్నెర మాల్యాద్రి, ప్రసాద్, బాలిరెడ్డి, ప్రవీణ్, మంజూర్, ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరోత్సవానికి తరలిరండి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 27 : చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 3న అక్షరోత్సవం పేరున కవి సమ్మేళనం జరుగుతుందని, తెలుగు భాషాభిమానులు, సాహితీ అభిమానులు తరలిరావాలని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిన్నినారాయణరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అక్షరోత్సవం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కవి సంగమ ఉద్యమ సారథి యాకూబ్ (హైదరాబాద్)కు అవార్డు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి నందమూరి లక్ష్మీపార్వతి హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో కళాంజలి అనంత్, బెనర్జీ, శ్రీధర్‌బాబు, రాధాకృష్ణ, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ఎవరికోసం మార్చారు?

చంద్రగిరి నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతున్న పోలింగ్ బూత్‌ల మార్పు

వసతులు లేకున్నా వైసీపీకి పట్టున్న గ్రామాలకు తరలించారంటూ ఈసీకి టీడీపీ ఫిర్యాదు

టీడీపీకి పట్టున్న గ్రామాల్లో ఓటు బ్యాంకును చీల్చడమే లక్ష్యంగా చంద్రగిరి నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో పోలింగ్ కేంద్రాలను పెంచడమే కాకుండా వైసీపీకి పట్టున్న గ్రామాల్లో ఏర్పాటు చేశారు. దశాబ్దాల కాలంగా వసతులున్న పోలింగ్ కేంద్రాలను తొలగించి వసతులు లేని స్థానాలకు మార్చడంపై టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో 325 పోలిగ్ కేంద్రాలుండేవి.తరువాత అధికార పార్టీ తమకు అనుకూలంగా 70 పోలింగ్ కేంద్రాలను పెంచింది. వీటిలో సుమారు వంద కేంద్రాల్లో మౌలిక వసతులు లేవు. రక్షణ లేని ప్రాంతాలకు పోలింగ్ కేంద్రాలను తరలించి రిగ్గింగ్ చేసుకోవడానికి అనుకూలంగా కొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

- తిరుచానూరు





వసతులు లేని పెద్దరామాపురం ,బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రాలు - మంగళంలో నిర్మిస్తున్న కొత్త భవనం

● పాకాల మండలం చిగరపల్లె ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండేది.గత ఎన్నికల్లో కూడా నాలుగు గ్రామాల ప్రజలు ఇక్కడే ఓటు హక్కును వినియోగించుకున్నారు.టీడీపీకి పట్టున్న ఈ పోలింగ్ కేంద్రాన్ని పెద్దరామాపురానికి తరలించారు. అంతకు ముందే ఇక్కడున్న పోలింగ్‌బూత్‌ను వసతులు లేకపోవడంతో ఇక్కడ తీసేశారు. అందరికీ అనుకూలంగా వున్న చిగరపల్లెలో యల్లంపల్లి, ఎనమలవారిపల్లి, ఇప్పకాలువ, గాజులవారి ఇళ్ల ప్రాంతాలకు చెందిన సుమారు 1,700మందికి పైగా ఓటు హక్కును వినియోగించు కునేవారు.ఇపుడు వీరంతా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కూడా లేని పెద్దరామాపురానికి వెళ్లి ఓటు వేయాల్సివుంది.

● రామచంద్రాపురం మండలం రావిళ్లవారిపల్లెలోని పోలింగ్ బూత్‌లో ఇన్నాళ్లూ ఓటు హక్కు వినియోగించు కునేవారు.దాన్ని రద్దు చేసి బ్రాహ్మణకాల్వ గ్రామానికి పోలింగ్ కేంద్రాన్ని తరలించారు.దాన్ని కూడా కనీస వసతు లు లేని దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేయడం గమనార్హం.ఇదే మండలం మహంతువారిపల్లెలోని పోలింగ్ కేంద్రాన్ని ఎలాంటి వసతులూ లేని ఒకే గది వున్న రైతు భరోసా కేంద్రానికి తరలించారు.

● తిరుపతి రూరల్ మండలం మంగళంలో ఏకంగా శిథిలావస్థలో ఉన్న భవనంలో పోలింగ్ కేంద్రంగా ప్రకటించారు.దీనిపై టీడీపీ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించగా ఆగమేఘాలపై భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. అది ఎన్నికల నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు.పెరుమాళపల్లి, అవిలాల, హరిపురంకాలనీ తదితర ప్రాంతాల్లోనూ వసతులు లేని పోలింగ్ కేంద్రాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని దాదాపు 30శాతం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, మరుగుదొడ్లు లేవని తీవ్ర విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో పునఃపరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ ఎత్తుగడతోనే మార్పు



రాజకీయ ఎత్తుగడతోనే అన్ని వసతులూ వున్న మా గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని మార్చారు. ఏ సౌకర్యంలేని పెద్దరామాపురానికి పోలింగు కేంద్రాన్ని ఎలా తరలిస్తారు? అధికారుల నిర్ణయం విడ్డూరంగా వుంది.

- యువరాజు, చిగరపల్లి

4 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా వుండేది



చిగరపల్లిలో పోలింగ్ కేంద్రం ఎంతో అనుకూలంగా ఉండేది.పక్కనే వున్న ఎనమలవారిపల్లి, యల్లంపల్లి, ఇప్పకాల్వ,గాజులవారిఇళ్ల గ్రామాల ప్రజలు సౌకర్యవంతంగా ఓటు హక్కును వినియోగించుకునేవారు. అలాంటిది మా ఊరిలోని పోలింగ్‌కేంద్రాన్ని వసతులు లేని పెద్ద రామాపురానికి తరలించడం ఎవరి ప్రయోజనం కోసం?

- విజయకుమార్, చిగరపల్లి

స్వేచ్ఛగా ఓటేయకుండా కుట్ర



రావిళ్లవారిపల్లెలో అన్ని వసతులూ ఉన్న పోలింగ్ కేంద్రంలో హాయిగా ఓటు హక్కును వినియోగించు కునేవాళ్లం.కుట్రతో ఎలాంటి సౌకర్యం లేని బ్రాహ్మణకాల్వ అంగన్‌వాడీ కేంద్రానికి పోలింగ్ కేంద్రాన్ని తరలించారు. ఒకే గది ఉన్న ఈ కేంద్రానికి ర్యాంపులేదు. ప్రహరీ లేదు.కనీస వసతులు లేని ఈ ప్రాంతానికి పోలింగ్ కేంద్రం తరలించడం వెనుక ఏ మర్మం వుందో అధికారులే చెప్పాలి.

- రామ్మోహన నాయుడు, బ్రాహ్మణకాల్వ

ఏం అవసరం వచ్చింది ?



రావిళ్లవారిపల్లె నుంచి పోలింగు కేంద్రాన్ని తరలించారు సరే బ్రాహ్మణకాల్వలోనే అన్ని వసతులూ వున్న స్కూల్లో ఏర్పాటు చేయొచ్చు కదా.వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రంలో ఎలా ఏర్పాటు చేస్తారు? ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకోకుండా చేసేందుకే ఈ మార్పు.

- భాస్కర నాయుడు, బ్రాహ్మణకాల్వ.




సభలో టీడీపీ నేతల సమైక్యనాదం

బీసీల మెడపై వైసీపీ కత్తి

● జయహో బీసీ సభలో టీడీపీ నేతల ధ్వజం

తిరుపతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు టీడీపీ పెద్దపీట వేస్తే, వైసీపీ తమ మెడపై కత్తిపీట వేసిందని బీసీ సంఘ నాయకులు మండిపడ్డారు. తిరుపతి ఇందిరా మైదానంలో మంగళవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం ఘనంగా జరిగింది.జిల్లా నలుమూలల నుంచి టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున డప్పు కొడుతూ, చిందులు వేస్తూ, బాణా సంచా పేలుళ్ల మధ్య ర్యాలీగా 'జయహో బీసీ' అంటూ సభావేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత ఎన్టీఆర్‌కు, పూలేకి నివాళులర్పించారు.సభకు అధ్యక్షత వహించిన పార్టీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు వెన్నుదన్నుగా నిలిచి, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించిందన్నారు.అయితే వైసీపీ ఈ ఐదేళ్లలో నిరంకుశ పాలనతో బీసీలను అణగదొక్కిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలందరూ ఏకోన్ముఖంగా నిలిచి చంద్రబాబును సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తీసుకురాబోతున్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యంగా బీసీలపై ఉందన్నారు.బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ విధులు, నిధులు ఉండే పదవులు వైసీపీ ముఖ్య సామాజికవర్గానికి కట్టబెట్టిన జగన్ రెడ్డి నిధుల్లేని, చివరకు కుర్చీలు కూడా లేని పదవులను బీసీలకిచ్చారని దుయ్యబట్టారు.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు బీసీలను టీటీడీ ఛైర్మన్లుగా నియమిస్తే జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు రెడ్లను నియమించారని గుర్తు చేశారు. అంటే బీసీలు టీటీడీ ఛైర్మన్ పదవికి పనికిరారని ఆయన భావించారంటూ ధ్వజమెత్తారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గురవారెడ్డి , మస్తాన్ యాదవ్ మాట్లాడుతూ బీసీల కోసం కార్పొరేషన్, ఫెడరేషన్లను పెట్టిన ఘనత చంద్రబాబుదైతే, బీసీలకు సబ్సిడీ రుణాలను రద్దుచేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు.బీసీ నాయకులు దంపూరి భాస్కర యాదవ్, కృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, పుష్పావతి, దశరథాచారి, మునస్వామి, బొమ్మి సురేంద్ర యాదవ్, లీలావతమ్మ, పెరుమాళ్ మధు, సుబ్బుయాదవ్, మధుసూదన యాదవ్, రామయ్య, సుబ్రమణ్యం రెడ్డి, సాధికార సమితి నాయకులు ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, రాజయ్య, శంకర్, అశోక్, శ్రీరాములు, భక్తవత్సలం, ఆముదాల తులసీదాస్, మనోహరాచారి, జగన్నాథం, విశ్వనాథం, పెరుమాళ్, మునిరాజ, భాస్కర్ గౌడ్, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొనగా తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నూరా సుధాకర రెడ్డి, బుల్లెట్ రమణ, బ్యాంకు శాంతమ్మ తదితరులు సభకు హాజరయ్యారు.



నవకంఠ రావణుడు!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కానుకగా భక్తులు సమర్పించిన రావణాసుర వాహనమిది.శివరాత్రి ఉత్సవాల ఊరేగింపులో వాడుకునేందుకు ఇద్దరు భక్తులు దారువుతో తయారుచేసిన ఈ వాహనాన్ని సోమవారం ముక్కంటి ఆలయానికి అందజేశారు. అయితే పది తలలుండాల్సిన రావణాసురుడికి 9మాత్రమే వుండడాన్ని అధికార యంత్రాంగం కానీ , ధర్మకర్తల మండలి కానీ గుర్తించకనే ఆలయంలో పెట్టేశారు. ప్రచార ఆర్భాటం, కమీషన్ల కక్కుర్తిపై దృష్టి పెట్టడం తప్ప ఇలాంటి వాటి గురించి ఎందుకు ఆలోచిస్తారంటూ భక్తజనం నుంచీ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.



షార్‌లో నిర్మించిన పిఫ్ భవనం

షార్‌లో పిఫ్ భవనం ప్రారంభం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 : తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో నిర్మించిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి (పిఫ్) భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. పీఎస్ఎల్వీ రాకెట్లతో పాటు చిన్న తరహా రాకెట్ల తయారీ, అనుసంధానం కోసం ఈ భవనాన్ని నిర్మించారు. పీఎస్ఎల్వీ ప్రయోగాలకే కాకుండా ఎస్ఎస్ఎల్వీ వంటి చిన్న ప్రయోగాల వేగవంతానికి కూడా ఇదెంతో దోహదపడుతోంది. ఇది అందుబాటులోకి రావడంతో ఇకపై ఏడాదికి 15 ప్రయోగాలు చేపట్టాలని ఇస్రో లక్ష్యం పెట్టుకుంది.ప్రధాని మోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సుమారు రూ.1800 కోట్లతో నిర్మించిన మూడు ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో షార్‌లోని పిఫ్, మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటి, వీఎస్ఎస్‌సీలో ట్రైసోనిక్ విండ్ టన్నెల్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

స్కాలర్‌షిప్ ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తాం

● మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్సీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని పద్మావతి మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ అరుణ్ హల్దార్ హెచ్చరించారు.2018 నుంచి యూనివర్సిటీలో నిర్వహించిన బీఏ, ఎంఏ పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉంచారు. దాంతో చండీప్రియ (చంద్రలేఖ)నేతృత్వంలోని 31మంది ఎస్సీ విద్యార్థినులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్.. వర్సిటీ రిజిస్ట్రార్, ఇతర అధికారులకు సమన్లు జారీ చేసింది. కమిషన్ ఎదుట విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఇటీవల కమిషన్ చేపట్టిన విచారణకు రిజిస్ట్రార్ హాజరై వివరణ ఇచ్చారు. దాంతో 21 రోజుల్లోపు విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరింది. లేకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు వర్సిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషియల్ వెల్ఫేర్ అధికారులకు లేఖ రాశారు.

ఏడాదిన్నరగా నడుస్తున్న వ్యవహారం

ఏడాదిన్నరగా ఈ వ్యవహారం నడుస్తోంది. గతంలో విద్యార్థినులు వర్సిటీలోనే ప్రత్యక్ష ఆందోళన కూడా చేపట్టారు. రూ.కోటీ 50 లక్షల మేర విద్యార్థినులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయి.

అతివేగానికి ముగ్గురు యువకుల బలి



మృతులు హరీష్, రామ్‌చరణ్

రేణిగుంట,ఫిబ్రవరి 27: అతివేగంతో బైకులను నడిపి ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు.గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.... చెన్నై-రేణిగుంట జాతీయరహదారిలో రేణిగుంట మండలం మొలగమూడి బస్టాప్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. నారాయణవనానికి చెందిన హరీష్(22),ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన రామ్‌చరణ్(17) పుత్తూరు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వస్తుండగా మొలగమూడి బస్టాప్ సమీపంలో రివర్స్ చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం తిరుపతి లోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

డ్యూటీనుంచి ఇంటికొస్తూ...



సురేంద్ర

నాయుడుపేట, ఫిబ్రవరి 27: నాయుడుపేట - తిమ్మాజికండ్రిగ మార్గంలోని స్వర్ణముఖినది సమీపంలో మోటారు సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. వాకాడు మండలం అందలమాల గ్రామానికి చెందిన సురేంద్ర మేనకూరు సెజ్‌లో పని చేస్తూ నాయుడుపేటలోని పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో స్వర్ణముఖినది బ్రిడ్జి సమీపానికి రాగానే ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూలో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి ఒకటి నుంచి ఏడో తేదీదాకా పరీక్షలు నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే, ఇదే తేదీల్లో టెట్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. దాంతో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు మార్చి ఏడో తేదీకి వాయిదా పడ్డాయి. 14వ తేదీ దాకా ఈ పరీక్షలు కొనసాగుతాయని సీఈ దామ్లానాయక్ పేర్కొన్నారు.

స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలను మార్చి ఒకటో తేదీనుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, ఒబెస్ట్రిక్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం), పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల పరిధిలో ఆరోగ్యశ్రీ కింద నగదు రహిత వైద్య సేవలు అందిస్తామన్నారు. సాధారణ, సిజేరియన్ కాన్పులు, టాన్సిల్స్, కాటరాక్ట్, హెర్నియా, అపెండిక్స్, మొలలు, థైరాయిడ్‌తోపాటు సాధారణ జబ్బులైన జ్వరాలు, వాంతులు, విరేచనాలు మొదలైన వాటికి కూడా నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

500 బస్తాల రేషన్ బియ్యం సీజ్



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: అక్రమంగా తరలిస్తున్న 500 బస్తాల రేషన్ బియ్యాన్ని డీఎస్పీ రఘువీర్ స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట జాతీయ రహదారిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. లారీని సీజ్ చేసి ఏఎంసీ గోదాముకు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ సుమారు రూ.10లక్షలుంటుందని రఘువీర్ తెలిపారు.

యువతను దగా చేసిన వైసీపీ: తెలుగు యువత



మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎస్ బ్రోచర్లను విడుదల చేస్తున్న నెలవల, రవినాయుడు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: యువతను అన్ని విధాలుగా వైసీపీ దగా చేసిందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవినాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో యువతకు ఇచ్చిన హామీలను విస్మరించారని అన్నారు. ఆడుదాం... ఆంధ్రా... పేరిట ఆర్భాటం చేసిన వైసీపీ రాష్ట్ర క్రికెట్ బోర్డును తన కబంధ హస్తాల్లోకి లాక్కుందని విమర్శించారు. రాష్ట్రంలో యువత, నిరుద్యోగులు వేసే ఓట్లే రాష్ట్ర భవిష్యత్తుకు నాంది పలుకుతాయని అన్నారు. నెలవల మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రాయల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, నాయకులు రవి, కార్తీక్‌రాజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సంధ్యారాణి, టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 27: చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక మసీదువీధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను పెంచివేయడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు, ఇతర వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు పరిచేలా చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోనను విడుదల చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, నాజరుద్దీన్, జహంగీర్, రవీంద్రరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నరసింహులు నాయుడు, అమరయ్య, గాయం రమణయ్య, గురవయ్య, భారతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం



ఇందిరమ్మ అభయహస్తం పోస్టర్లను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నేతలు

గూడూరు, ఫిబ్రవరి 27: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ అభయహస్తం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయహస్తం పథకం ద్వారా ప్రతి పేద కుటుంబంలోని మహిళకు ప్రతి నెలా రూ.5వేలు అందజేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అలాగే తిరుపతిలో మార్చి 1వ తేదీన షర్మిల సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, వేమయ్య, భాస్కర్, హరికృష్ణ, శ్రీనివాసాచారి, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 27: స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, నాశిన నాగులు, గిరిబాబు, రాఘవరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గూడూరు, ఫిబ్రవరి 27: స్థానిక మసీదువీధికి చెందిన పెయింటర్ అఫ్జల్ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీలో భక్తులు సమర్పించి కానుకలను జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. రెండు నెలల పదిహేను రోజులకు హుండీ ద్వారా రూ.3,31,592 ఆదాయం వచ్చినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నగదును బ్యాంకులో జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, కమిటీ సభ్యులు దేవత చెంచుకిషోర్‌బాబు, పసల హరి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు, ఈవో శశాంక్, సీనియర్ సహాయకుడు దినేష్, సిబ్బంది యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పోలేరమ్మ హుండీ నగదును లెక్కిస్తున్న సిబ్బంది







మంగళంపాడు మార్గంలో, మంగళంపాడు వద్ద పొలాల్లో, మన్నారుపోలూరు కోనేరు సమీపంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు

అల్లుకున్న నిర్లక్ష్యం

విద్యుత్ స్తంభాలను కప్పేసిన తీగలు ● పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25: సూళ్లూరుపేట నుంచి మంగళంపాడుకు వెళ్లే మార్గంలో వెంగలాపురం - మంగళంపాడు మధ్యలో రోడ్డు అంచునే ఉన్న విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకుపోయాయి. కింద నుంచి తీగలు అల్లుకోవడంతో విద్యుత్ స్తంభం చెట్టులా కనబడుతోంది. అదే విధంగా ఉగ్గుముడి అంగన్వాడీ కేంద్రం వద్ద కూడా ఇదే పరిస్థితి. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో మన్నారుపోలూరు కోనేరు వద్ద విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకొన్నాయి. స్తంభాలకు ఉన్న తీగలు అల్లుకుపోవడంతో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయని, పలుసార్లు విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేనది స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అటువైపు వెళ్తూ చూస్తున్నారే తప్ప స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించడానికి చొరవచూపడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వీడి స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధన చేయాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27: విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచి సులభ పద్ధతిలో బోధన చేస్తే వారి ఎదుగదలకు ఎంతో ఉపయోగమని తరల్ (టీఏఆర్ఎల్) రాష్ట్ర పరిశీలకుడు వినోద్ దీపక్ అన్నారు. మంగళవారం ఆయన విద్యాశాఖ అధికారులతో కలిసి శ్రీహరికోటలోని జడ్పీ హైస్కూల్, కుదిరి ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సుధీర్ శర్మ, ఎంఈవో శీనయ్య, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి: కురుగొండ్ల



డయాలసిస్ పేషంట్లతో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 27: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా స్థానికుడు నాగరాజు మాట్లాడుతూ తాను, తన భార్య కిడ్నీ సమస్యలతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నామని తెలిపారు. తనకు ప్రభుత్వం రూ.10వేలు ఇస్తోందని, తన భార్యకు ఇవ్వడం కుదరదని చెబుతున్నారని కురుగొండ్ల దృష్టికి తీసుకెళ్లారు. రూ.10వేలతో ఇద్దరికీ వైద్యం చేయించుకొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని కురుగొండ్ల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు, గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, రవి, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

డక్కిలి, ఫిబ్రవరి 27: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ మార్చి 3,4,5 తేదీల్లో విధిగా పల్స్‌పోలియో చుక్కలు వేయాలని స్థానిక వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో ఆశ, ఆరోగ్య వైద్య సిబ్బందికి పల్స్‌పోలియో నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 4445 మంది ఐదేళ్ల లోపు పిల్లలు వున్నట్లు గుర్తించడం జరిగిందని, వీరందరికీ పోలియో చుక్కలు వేయడానికి 61 కేంద్రాలు ఏర్పాటు చేశామని, అంతేకాకుండా మొబైల్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికి అందరూ కృషి యేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి శ్రీహరి, సీహెచ్‌వో శశికళ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

కోట, ఫిబ్రవరి 27: గిరిజన గురుకులాల విద్యార్థులు టెన్త్, ఇంటర్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని చిట్టేడులో గల గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లను అందజేశారు. అమరావతి సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న చిట్టేడు కళాశాల పూర్వవిద్యార్థి నారాయణ చేతులమీదుగా ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్‌లను అందజేశారు.

రక్తహీనత మరణాల నివారణే ప్రభుత్వ లక్ష్యం

తడ, ఫిబ్రవరి 27: బాలింతలు, గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత మరణాలను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ డీపీఎంవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రామాపురం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాల అధికారి నరేంద్రకుమార్, డీపీహెచ్‌అండ్‌వో బేబిరాణి, డీపీవో ప్రకాష్, వైద్యులు జయశ్రీదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్ధాలు



విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

డక్కిలి, ఫిబ్రవరి 27: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని సీడీపీవో సంషాద్ బేగం అన్నారు. మంగళవారం స్థానిక బాలయోగి గురుకుల కళాశాల విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతీ, యువకులు మేజర్లు కాకుండా వివాహం చేసుకుంటే చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా అంగన్వాడీ కార్యకర్తలతో పాటు ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని కోరారు. అంగన్వాడీ సూపర్‌వైజర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర

చిట్టమూరు ఫిబ్రవరి 27: మండలంలోని కొత్తగుంట, సోమసముద్రం, మల్లాం, ఎల్లసిరి గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. శరత్‌చంద్రరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పార్థసారదిరెడ్డి, రామయ్య, యుగంధర్‌రెడ్డి, మునిబాబు, వెంకటయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ 16వ తేదీకి వాయిదా

గూడూరు, ఫిబ్రవరి 27: స్థానిక కోర్టు ఆవరణలో మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని మహాశివరాత్రి సందర్భంగా 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తెలిపారు. ఈ మార్పును కక్షిదారులు గమనించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

వెంకటగిరి, ఫిబ్రవరి 27: వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ప్రకాశం జిల్లా అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్ నియమితులయ్యారు. కాగా, వెంకటరమణయ్య కృష్ణా జిల్లా పెడన మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 27: నాయుడుపేట - తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖి నది బ్రిడ్జిపైన ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాలాయపల్లి మండలం సంఘవరం నుంచి ప్రయాణికులతో నాయుడుపేట వైపు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శీను తీవ్రంగా గాయపడగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేమిరెడ్డితో చిల్లకూరు మంతనాలు

టీడీపీలో చేరతానని ప్రకటన



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో చర్చిస్తున్న దశరథరామిరెడ్డి

కోట, ఫిబ్రవరి 27: కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత చిల్లకూరు దశరథరామిరెడ్డి నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి చర్చలు జరిపారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, నల్లపరెడ్డి, నేదురుమల్లి కుటుంబాలకు సన్నిహితుడు అయిన దశరథరామిరెడ్డి కోట మండల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. వేమిరెడ్డిని కలిసిన అనంతరం దశరథరామిరెడ్డి మాట్లాడుతూ మార్చి 2వ తేదీన టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

తడ, ఫిబ్రవరి 27: స్థానిక బాలిక, బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రీ పబ్లిక్ పరీక్షా కేంద్రాలను ఎంఈవో మల్లికార్జున్ రావు పరిశీలించారు. అలాగే గ్రద్దగుంట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థినిలకు దిండ్లు అందజేస్తున్న రవీంద్రకుమార్

గూడూరు, ఫిబ్రవరి 27: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పంచాయతీరాజ్‌శాఖ డీఈ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బాలసదనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు దిండ్లు, వసతి గృహానికి గీజర్ అందజేశారు. విద్యార్థినిలు కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, రవిచంద్ర, రామచంద్రయ్య, కృష్ణబాబు, రమణయ్య, శ్రీనివాసులురెడ్డి, ఇలియాజ్ అహ్మద్, కళ్యాణ్‌సాయి, శివయ్య, రూపేష్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం గణనాథుని కల్యాణం

కోట, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని విద్యానగర్‌లో మంగళవారం రాత్రి వినాయక ఆలయంలో స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ సప్తమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికుల ఆధ్వర్యంలో శ్రీసిద్ధి, బుద్ధి అమ్మవార్లతో గణనాథుడికి వేదపండితులు కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు.



వినాయకుడి కల్యాణం జరుపుతున్న పండితులు

టీడీపీతోనే రామరాజ్యం: పాశిం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశిం, టీడీపీ నేతలు

కోట, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో ఐదేళ్ల రాక్షస పాలనలో ముగిసి రెండు నెలల్లో రామరాజ్యం రానున్నదని గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం కోట పట్టణంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి గోపాలరెడ్డి విగ్రహం సెంటర్, శ్యామసుందరపురం సెంటర్లలో పాశిం సునీల్‌కుమార్‌కు పట్టణ ప్రజలు మంగళ హారతులతో అడుగడుగున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ దుష్టపాలనను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలన్నారు. పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీయాలంటే సైకిల్ గుర్తుపై ఓటువేసి చంద్రబాబునాయుడును సీఎం గానూ, తనను ఎమ్మెల్యేగానూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, పోలయ్య, అనిల్, గుర్రం అశోక్‌కుమార్, దారా సురేష్, నౌషాద్, షంషుద్దీన్, వెంకటకృష్ణయ్య, వెంకటకృష్ణారెడ్డి, సుహాసిని, పోలమ్మ, తదితరులు ఉన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకువద్దాం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 27: సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం పెళ్లకూరులోని టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అధినేత చంద్రబాబునాయుడు సూళ్లూరుపేట నియోజకవర్గంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించి అధినేతకు కానుకుగా ఇద్దామని అన్నారు. అధికార పక్ష నేతల వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని, పార్టీ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎన్నికలు సజావుగా జరిగితే స్వాగతిస్తామని... అలా కాకుండా అధికార పార్టీ నాయకులు దురాగతాలకు పాల్పడితే సమరానికైనా సంసిద్ధంగా ఉన్నామని నెలవల హెచ్చరించారు. అనంతరం ఎన్నికల ప్రచార కార్యక్రమాలతో పాటు బూత్‌ల నిర్వాహణపై నాయకులతో కలసి కార్యచరణ రూపొందించారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, స్వీడన్ ఎన్ఆర్ఐ టీడీపీ ఫోరం అధ్యక్షుడు వున్నం నవీన్‌కుమార్ నాయుడు, సీనియర్ నేతలు పేరం రమేష్‌నాయుడు, చంద్రబాబు నాయుడు, సర్పంచుల సంఘ నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కొణిదల బాలచంద్ర నాయుడు, గాలి రమేష్‌నాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నెలవల రాజేష్, చెంబేటి సుజాతమ్మ, సురేష్‌నాయుడు, కలవకోలు మునీష్, కేవీనాయుడు, సుబ్బరామయ్య, శ్రీనివాసులునాయుడు, మునీంద్ర, గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

అందరినీ కలుపుకొని ముందుకు: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27: సూళ్లూరుపేట నియోజకవర్గంలో సీనియర్ నాయకులందరినీ కలుపుకొని ముందుకుపోతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ చెప్పారు. మంగళవారం ఆమె తన సోదరుడు నెలవల రాజేష్‌తో కలిసి సూళ్లూరుపేటలోని పలువురు టీడీపీ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడి తన గెలుపునకు సహకరించాలని కోరారు. అంతకుముందు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఇంటికెళ్లి కలిశారు. కార్యక్రమంలో చిట్టేటి పెరుమాల్, ఏజీ కిషోర్, పెంచలయ్య, బుజ్జిబాబు, నాపా మునిరాజా, మునస్వామి, మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, మేడా సాయినారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

నాయుడుపేట, ఫిబ్రవరి 27: పట్టణంలోని మంగపతి నాయుడు నగర్‌కు చెందిన శోభన్‌నాయుడు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి నెలవల సుబ్రహ్మణ్యం పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేమసాని రాజగోపాల నాయుడు, రవి నాయుడు, నరసింహులు, జయశంకర్, సిద్దయ్య పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై బాలికలకు అవగాహన

తడ, ఫిబ్రవరి 27: శ్రీసిటీలోని ప్రముఖ నాప్‌కిన్ తయారీ పరిశ్రమ యూనిచార్మ్ శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో మన సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బాలికల వ్యక్తిగత శుభ్రత అనే అంశంపై సూళ్లూరుపేటలోని ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూలులో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి నిరీషా సన్నారెడ్డి, యూనిచార్మ్ సీఎస్ఆర్ వింగ్ నిపుణులు అంకిత తదితరులు సూళ్లూరుపేటలోని ఏపీఎస్ డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూలు, బీసీ బాలికల హాస్టల్, తడలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయకు చెందిన వెయ్యి మంది పైగా విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్ ప్యాక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మన సంస్కృతి సేవా ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కె.హరినాథరెడ్డి, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న నిరీషా సన్నారెడ్డి